# ఎవరు నాస్తికులు? ఎవరు ఆస్తికులు?

పర్వదినమొస్తేచాలు, జనంలో భక్తి మేల్కొంటుంది. తెల్లవారేసరికి మార్కెట్టులో పువ్వులూ పూజా ద్రవ్యాలూ అయిపోతాయి. రైళ్ళు, బస్సులు, క్షేత్రాలు, హుండీలు నిండిపోతాయి. ఈ దేశంలో యింతమంది ఆస్తికులున్నారా అని ప్రపంచం విస్తుపోతుంది. యింతమంది మూఢులీదేశంలో వున్నారా అనుకునేవారూ వున్నారు. పూజలు, వ్రతాలు, యజ్ఞాలు, సువార్త కూటములు, ఇస్లామిక్ సమావేశాల సంగతి చెప్పనక్కరలేదు.

వాస్తవమేమంటే, " ఎవ్వనిచే జనించు.... శరణంబు వేడెదన్" అని వల్లించేవారు ఆస్తికులూ గారు, " ఓ దేవుడా, నీ ఆటకట్టు, నీ బూటకం రట్టు" అనేవారంతా నాస్తికులూ గారు.

ఒక వూళ్ళో ఒక దేవాలయమున్నది. ఊర్లో నిత్య దైవదర్శనం చేసుకొనేవారు. దేవుడు లేడనేవారూ వున్నారు. భగవంతరావు, వామనరావులను తెలియనివారే వూళ్లోలేరు. ఎవరికి కష్టమొచ్చినా తమదిగా భావించి ఆదుకోడానికి ముందుకు వచ్చేవారు. తమను జనం గౌరవించినా నిందించినా చలించక, ధనికుల, పేదలతో సమంగా వ్యవహరించేవారు. ఎవరిపట్లా శతృత్వమే వహించని కారుణ్యమూర్తులు వారు.

ఆ ఊళ్లో ఒక పేద దర్జీకి జబ్బుచేసింది. నా అన్నవారులేరు. అతడు కనిపించిన వారందరినీ సహాయమర్థిం స్తూంటే గ్రామస్తులు అసహ్యించుకున్నారు. భగవంతరావు, వామనరావులు మాత్రం అతణ్ణి సొంత సోదరుడుగా భావించారు. ఒకరు అతని కాలకృత్యాల సంగతి చూచుకొంటూ దగ్గరవుండి సేవచేస్తుంటే, యింకొకరు అస్పత్రికి వెళ్ళి మందులు తెచ్చిచ్చేవారు. త్వరలో అతడు కోలుకున్నాడు.

ఈ విశ్వమంతటా అన్ని జీవులలోనూ వున్నశక్తే భగవంతుడని, సాధనతో ఆయనతో తాదాత్మ్యం చెందడమే ముక్తియని, తనకూ సమాజానికీ అట్టి ఆనందం కల్గేలా కృషిచేయడమే సాధనయనీ చెప్పేవాడు భగవంతరావు. అందరిలో దైవాన్ని చూడగల్గడానికిదొక్కటే మార్గమనేవాడు. అందుకే ఎవరిపట్లా శతృత్వం వహించలేకపోయేవాడు. ఇతరుల కష్టసుఖాలను తనవిగా భావించక ఏంచేస్తాడు? అతనిలో భగవద్గీత చెప్పిన సత్త్వగుణము, దైవీసంపదా తాండవించేవి. మానవసేవలో నిమగ్నుడైన యితడు తరచు ఆలయానికి గూడ వెళ్ళలేకపోయేవాడు. కాని దైవం అతని చెంతనే అతి లోపలా, బయటా ఉండేవాడు.

దైవంలేడని, మనిషిపట్ల ప్రేమతో బాధ్యత నిర్వర్తించడమే మానవ కర్తవ్యమని చెప్పేవాడు వామనరావు. మరోకవంక దేముడు లేడంటూ నినాదాలుచేస్తూ ఎట్టి సేవాకార్యాలు చేయకుండా గాలికి తిరిగేవారితోపాటు పిల్లికి బిచ్చమెయ్యకుండా ఆలయానికి వెళుతూ, భగవంతరావు, వామనరావులపట్ల ప్రజలకు గల ఆదరణకు అసూయ చెందుతూ, వారిమీద నిందలు మోపుతుండే 'ఆస్తికులూ' ఉండేవారు. ఇలాంటివారు నాస్తికులైనా, ఆస్తికులైనా ఒక్కటే.

'భగవంతరావు ఆస్తికభావాలతో నాకేమి పని? అతడి మానవత్వం నన్నాకర్షిస్తుంది' అంటాడు వామనరావు. 'వామనరావు నాస్తికుడైతేనేమి? అతడి ఆచరణలో తనలోవున్న ఆత్మే సాటివారిలోనూ వున్నదన్న సత్త్వగుణ సంపద వున్నది. అతడంగీకరించకపోయినా అతని ఆచరణంతా నిరంతర పరమేశ్వరారాధనే' నంటాడు భగవంతరావు.

వాళ్లకు ప్రతిరోజూ పర్వదినమే. సాటివారిలో మానవత్వాన్ని మేల్కొల్పే యత్నమే వారిపూజ. ప్రజల హృదయాలే వారు నింపే హుండీలు! విశ్వమంతా వారి దృష్టిలో దేవాలయమే.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

SRI MANGA BHARDWAJA TRUST


# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

చీఫ్ ఎడిటర్: **శ్రీ పోలూరి శ్రీనివాసరావు** బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: **డా॥ ఆర్.ఎస్. శశిధర్,** పిహెచ్. డి

**సంపుటి: 28** **సెప్టెంబర్ 2010** **సంచిక: 6**


పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజులచే
1983లో స్థాపించబడిన ఆధ్యాత్మిక పత్రిక మన
**"సాయిబాబా"**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎవరు నాస్తికులు? ఎవరు ఆస్తికులు? | 01 |
| 2. | శ్రీ పాద శ్రీవల్లభస్వామి | 03 |
| 3. | తద్విద్ధి ప్రణిపాతేన | 05 |
| 4. | చీరాల స్వామి | 07 |
| 5. | శ్రీ గజానన్ మహరాజ్ | 09 |
| 6. | శ్రీ సాయి సచ్చరిత్ర | 12 |
| 7. | శ్రీ దత్తలీలామృతం –సీరియల్ | 14 |
| 8. | వార్తాలాపము – సీరియల్ | 17 |
| 9. | గణపతి పూజలోని రహస్యం | 20 |
| 10. | శ్రీ భరద్వాజ లేఖామృతము | 22 |
| 11. | పాత్రశుద్ధి | 24 |
| 12. | ఆధ్యాత్మజ్యోతి | 26 |


**"సాయిబాబా"**
**పాఠకులకు వినాయక చవితి, కృష్ణాష్టమి, రంజాన్ శుభాకాంక్షలు**

## చందా వివరములు

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |
| (సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును) | |
| (20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది) | |
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |

సాయికి గురుసేవ తప్ప మరేమీ తెలియకున్నా ఆయనట్టి పరిపూర్ణత నొందారని కొందరు అలానే మరేమీ తెలుసుకొనే యత్నం చేయరు. ఏ విషయాన్నైనా సరిగా తెలుసుకుంటేగాని ఆచరించలేము. ఆచరిస్తేగాని ఫలితముండదు. కనుక మొదట తెలుసుకోవాలి. తెలియ వలసినదంతా తెలుసుకున్నారు గనుకనే సాయి ఒక్కరే తమ గురువు యొక్క పూర్ణానుగ్రహానికి పాత్రులు కాగలిగారు.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**


## చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org
www.saimasterforums.org



సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.


"సూర్య చంద్రాదులున్నంత వారకు నా అవతార కార్యము కొనసాగుతూనే వుంటుంది".

# శ్రీ పాద శ్రీవల్లభస్వామి

ఆచార్య శ్రీ భరద్వాజ

ఇప్పటికంటే ధర్మమధికంగా వున్న ద్వాపర యుగంలోనే "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే" అని శ్రీ కృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు, ఎన్నోవేలమందిలో ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించేవాడు ఏ ఒక్కడో వుంటాడు. అటువంటప్పుడు యీ కలికాలంలో ఎందరుంటారు? లోకానికి ఉత్తమ మార్గం బోధించి ఆచరింపజేయగలవారెవరు? ప్రజలలో యజ్ఞము, దానము, తపస్సు, కర్మ, ధర్మము లోపించడంవలన మానవులపట్ల దేవతలుగూడ నిర్దయులయ్యారు. కనుక కృపాళువైన దత్తాత్రేయుడు యీ యుగంలో శ్రీ పాదవల్లభుడు, శ్రీ నరసింహ సరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ స్వామి సమర్థ, శ్రీ శిరిడీ సాయిబాబా రూపాలలో అవతరించారు. ఈ దత్తావతారాలకు, వారి భౌతిక దేహాలు అంతమైనంత మాత్రాన వారి వునికికి భంగంరాదు. కారణం వారు దేహాలతో వున్నప్పుడు గూడ వారి భక్తులెక్కడ ఆపదలోనున్నా అక్కడికక్కడే వివిధ రూపాలలో దర్శనమిచ్చి రక్షించారు. వారి భౌతిక దేహాలు గుప్తమయ్యాక గూడ యీ లీల యిలానే కొనసాగుతున్నది. యిక ముందుగూడ కొనసాగబోతుందని వారు వాగ్దానమిచ్చారు.

ఈనాడు వీరి అనుగ్రహం పొందటానికి సులభము, శ్రేష్టము అయిన మార్గం వారి చరిత్రల పారాయణ, చింతనము, నామస్మరణ. పరీక్షన్మహారాజుకు మృత్యువాసన్నమైనప్పుడు శుకమహర్షిగూడ 'భాగవతము' అనే భగవంతుని అవతారాల కథను శ్రవణం చేయించి ముక్తి నిచ్చాడు. అలానే శ్రీ దత్తావతారాల క్షేత్రాలను దర్శించినప్పుడు గాని, అంతకుముందు గాని వారి చరిత్రలు శ్రద్ధగా పారాయణ చేయడం శ్రేష్టం. ఆ క్షేత్రాలలో కొద్ది సమయం మాత్రమే వుండే అవకాశం కల్గినవారు, అక్కడ యీ క్రింద కథలను సంక్షిప్తంగా పారాయణ చేసి స్తోత్రాలు చదువుకొని, నామస్మరణ చేయడం శ్రేష్టం. ఈ మహాత్ములు మహిమాన్వితమైన తమ కథలరూపంలో భక్తుల హృదయాలలో ప్రవేశించి దుష్ట సంస్కారాలను, పాపాలనూ దహిస్తారు. అట్టి భక్తులు భుక్తి, ముక్తిగూడ పొందుతారు అని ఆ మహాత్ములందరూ అభయమిచ్చారు. "శ్రీ గురు చరిత్ర" శ్రవణ మాత్రంచేత భుక్తి ముక్తులేగాక అభీష్టాలన్నీ నిశ్చయంగా సిద్ధిస్తాయి. శుచితోను, భక్తితోను సప్తాహ పారాయణ, లేక శ్రవణము చేసేవారికి సంతానం కల్గుతుంది. ఆ చరిత్ర పారాయణ చేసినవారింట్లో లక్ష్మీదేవి సహజమైన తన చాంచల్యం విడచి స్థిరంగా వుంటుంది" అని శ్రీ నృసింహ సరస్వతి ప్రమాణం చేశారు.

శ్లో: కృతే జనార్థనోదేవో, త్రేతాయాం రఘునందన: ।

ద్వాపరేరామ, కృష్ణశ్చ, కలౌ శ్రీపాద వల్లభ: ॥

తా॥ "కృతయుగంలో జనార్థనుడు దైవం, త్రేతాయుగంలో (దైవం) రఘునందనుడు, ద్వాపరంలో బలరామకృష్ణులు, కలియుగంలో శ్రీ పాదవల్లభులు" అని భవిష్యోత్తర పురాణం చెబుతున్నది. పవిత్ర గోదావరీ ప్రాంతంలోని పిఠాపురంలో అప్పళరాజు శర్మ, సుమతి అను బ్రాహ్మణ దంపతులుండేవారు. వారు దత్తాత్రేయునికి పరమ భక్తులు. వారికి పుట్టిన బిడ్డలందరూ గతించిపోయి ఒక కుంటి, ఒక గ్రుడ్డిమాత్రమే బ్రతికారు. అయినా ఆ దంపతులు ఆచంచలమైన భక్తితో, భిక్షకొచ్చిన వారిని దత్తాత్రేయుడుగా భావించి ఆదరించేవారు. ఒక అమావాస్యనాడు వారింట్లో శ్రాద్ధకర్మ జరుగుతూండగా, బోక్తలు భుజించకముందే ఒక యతీశ్వరుడు భిక్షకొచ్చాడు. ఆ గృహిణి సంకోచించక భక్తి విశ్వాసాలతో ఆయనకు భిక్షనిచ్చింది. ఆయన సంతోషించి తన యదార్థమైన దత్తాత్రేయ రూపంలో దర్శమిచ్చాడు. తరువాత ఆమెను వరం కోరుకోమన్నాడు. ఆమె, "పరమాత్మా, నీవు నన్ను 'తల్లీ' అని సంబోధించావు, ఆమాట నిలుపుకోచాలు" అన్నది. ఆయన ఆ వరమిచ్చాడు గాని, ఆమె పుత్రవ్యామోహానికి లోబడక ఆ బిడ్డమాటను అక్షరాలా పాటించాలని చెప్పి అంతర్హితుడయ్యాడు.

ఆ తరువాత సుమతీదేవి గర్భం ధరించి, ఒక భాద్రపద శుద్ధచతుర్థినాడు మగశిశువును కన్నది. అతనిలోని దివ్యచిహ్నాలు చూచి అతనికి 'శ్రీపాద వల్లభుడు' అని పేరు పెట్టారు. జన్మలేనివాడు, శాశ్వతుడు అయిన పరమాత్మకు జన్మనిచ్చి, స్తన్యమిచ్చి, మానవాళికి ఆయనను, "శ్రీ గురుచరిత్ర'ను పవిత్ర దత్త సాంప్రదాయాన్నీ ప్రసాదించే మాహాభాగ్యం అలనాడు అనసూయాదేవి తర్వాత మరల యీ సుమతీదేవికే దక్కింది.

## శ్రీ పాద శ్రీవల్లభస్వామి

శ్రీ పాదుడికి ఏడవ సం॥ రాగానే ఉపనయనము చేశారు. వేద పురుషుడైన ఆయన ఉపనయనమవగానే వేదం చేప్పాడు. తరువాత శిష్యులకు వేదవేదాంత శాస్త్రాలు బోధిస్తూ, 16వ సం॥ వరకూ శ్రీ పాదస్వామి యింటివద్దనే వున్నారు. ఆయనకు యుక్త వయస్సు రాగానే తల్లిదండ్రులు వివాహ ప్రయత్నమారంభించారు. కాని శ్రీపాదస్వామి సన్యాసియై తపస్సు చేస్తానన్నారు. తల్లి, "నాయనా, నిన్ను చూచుకొని గర్భశోకం మరచాను. నీ అన్నలు అవిటివారు. నీవైనా వివాహం చేసుకొని వంశాన్నుద్ధరించకుంటే ఎలా? వృద్ధాప్యంలో మాకు అండ ఎవరు?" అని వాపోయింది. శ్రీపాదులు తమ అమృత హస్తంతో తన అన్నలను స్పృశించగానే వారి అవిటితనము పోయింది. అపుడాయన తమ నిజరూపం దర్శింపజేసి, "నీవీ రూపాన్ని ధ్యానిస్తూండూ. ఈ కొడుకులిద్దరూ మిమ్మల్ని సేవిస్తారు. మీరు నా సాయుజ్యం పొందుతారు" అని చెప్పారు. అంతటితో ఆయనపై పుత్రవ్యామోహమంతరించి సుమతీదేవి అనుమతించింది. శ్రీపాదుడు సన్యసించి పాదాచారియై లోకోద్ధరణకోసం బయలుదేరారు. ఆయన ద్వారక, కాశీ, బృందావనములు తమ పాదస్పర్శతో పావనంచేసి బదరికాశ్రమంచేరి అక్కడ కొంత కాలమున్నారు. తరువాత గోకర్ణంలో మూడు సం॥లు, శ్రీ శైలంలో నాలుగు మాసాలు వుండి, తరువాత నివృత్తి సంగమం దర్శించి, కృష్ణా తీరంలోని కురుపురం చేరారు. కురుపురం వద్ద ఒక సద్బ్రాహ్మణుని కొడుకు జడమతి. ఉపనయన మయ్యాక అనుష్టానంగూడ చేయలేకపోయేవాడు. ఆ దిగులుతోనే అతని తండ్రి మరణించాడు. అతని భార్య, కొడుకు బిచ్చమెత్తుకుని జీవించేవారు. కాని గ్రామస్తులు, "పవిత్రమైన భిక్షావృత్తి నీవంటి అసమర్థుడుకి తగదు. నీ బ్రతుకు వ్యర్థం" అని నిందిస్తుంటే అవమానం భరించలేక, అంబాదేవి, కొడుకు-యిద్దరూ ఆత్మహత్య చేసుకోదలచి, కృష్ణానది వద్దకు వెడుతున్నారు. శ్రీ పాదుడది చూచి ఆత్మహత్య మహాపాపమని చెప్పి వారిని వారించారు. ఆ బ్రాహ్మణుని మొర విని, 'నీవు జీవిత శేషమంతా శివపూజ చేస్తే వచ్చే జన్మలో నావంటి కుమారుడే కల్గుతాడు' అని చెప్పి ఆమెకు శివునిగా దర్శనమిచ్చారు. ఆ వెంటనే ఆమె కొడుకు తలపై తమ హస్తముంచి ప్రణవముచ్చరించగానే అతడు మహాపండితుడయ్యాడు. ఆమె సంతోషించి తన జీవిత శేషమంతా శివార్చనలో గడిపింది. అలానే ఒక రజకుడు నిత్యమూ శ్రీ పాదులను శ్రద్ధగా సేవించేవాడు. ఒకనాడతడు నదికివెళ్ళి అక్కడ జలకాలాడుతున్న ఒక రాజును, వైభవంగా తరలివచ్చిన అతని పరివారాన్నీ చూచి, "ఇతడెంత అదృష్టవంతుడు! నాకట్టి వైభవం లభించడం కల్ల!" అనుకొన్నాడు. తరువాత అతడు శ్రీ పాదస్వామిని దర్శించగానే ఆయన, "నీ మనస్సులో రాజవైభవమనుభవించాలన్న కోరిక కలిగిందికదా? అది ఈ జన్మలో లభించినా అది వృద్ధాప్యంలో సుఖాలనుభవించలేవు గనుక, వచ్చే జన్మలో వైడూర్య నగరంలో యవన రాజకుమారుడుగా జన్మిస్తావు" అన్నారు. అతడు నమస్కరించి, "అయినా నాకు మీపై భక్తిననుగ్రహించండి" అన్నాడు. స్వామి, "అపుడు మేము నృసింహ సరస్వతియనే యతి రూపంలో అవతరించవలసి వున్నది. అపుడు నిన్ను మాచెంత చేర్చుకుంటాము' అని అబయమిచ్చారు. తర్వాత శ్రీ పాదస్వామి ఒక బ్రాహ్మణికి యిచ్చిన మాటనునుసరించి ఆమెకు పుత్రుడిగా అవతరించదలచి, ఆశ్వయుజ బహుళ ద్వాదశీ, మృగశిరా నక్షత్రంనాడు కృష్ణా నదిలో దిగి అంతర్హితులయ్యారు. అయినప్పటికీ కురువపురంలో తమను సేవించిన వారిని అనుగ్రహిస్తూనే వున్నారు. వల్లభేశుడనే బ్రాహ్మణుడు తనకు వ్యాపారంలో లాభమొస్తే కురువపురం దర్శించి, వేయిమంది బ్రాహ్మణులకు సంతర్పణ చేస్తానని మొక్కుకున్నాడు. స్వామి దయవలన అతని కోరిక నెరవేరింది. అతడు డబ్బు తీసుకొని కురువపురం వెడుతూంటే ఒక నిర్జనారణ్యంలో ఒకరాత్రి నలుగురు దొంగలతనిని చంపి డబ్బు దోచుకున్నారు. వారు పారిపోయేలోగా జడలు, భస్మము, శూలము ధరించి శ్రీ పాదులు ప్రత్యక్షమై వారిని సంహరించారు. తరువాత ఒక సాటి ప్రయాణికునికి విభూతి యిచ్చి వల్లభేశుని శవం మీద చల్లమని చెప్పి అదృశ్యమయ్యారు. వల్లభేశుడు నిద్రనుండి మేల్కొన్నట్లు లేచి కూర్చుని జరిగినదంతా తెలుసుకున్నాడు. అతడు కురువపురంలో శ్రీ పాదుని పూజించి, నాలుగు వేలమందికి సంతర్పణ చేశాడు. శ్రీ పాదుని సేవించి వారి సాక్షాత్కారం పొందిన భక్తులు వారినిలా వర్ణించారు. ఆయన పాదుకలు, కౌపీనము, కాషాయము, భస్మము, రుద్రాక్షమాల కల్గియుంటారు. వారి చేతిలో కమండలము, తలపై జడలు వుంటాయి. వికసించిన పద్మాలవంటి కన్నులు, పున్నమి చంద్రుని వంటి ముఖమూ గల శ్రీపాదస్వామి త్రికాలలోనూ కృష్ణానదిలో స్నానము, సహస్రగాయత్రీజపము, 108 సాష్టాంగ సూర్య నమస్కారాలు చేస్తూంటారు.

---

కృష్ణాష్టమి ప్రత్యేక వ్యాసం

# తద్విద్ధి ప్రణిపాతేన

ఆచార్య శ్రీ భరద్వాజ

ఎంతో మంది ఎన్నో జపాలు, ధ్యానాలు, పారాయణలు, పూజలుచేస్తారు. కాని మనస్సు ధ్యానంలో ఏకాగ్రం కాలేదని వాపోతుంటారు! సలహాలకోసం ఎందరో పెద్దలను దర్శించి ప్రశ్నిస్తారు. ఒక దేవతను వదిలి యింకొక గురువును, ఒక సాంప్రదాయాన్ని వదిలి యింకొక సాంప్రదాయాన్ని ఆశ్రయిస్తుంటారు. కొంతకాలం ఆ క్రొత్తదనం వలన ప్రయోజనమున్నట్లనిపించినా, మరి కొంతకాలానికి వారి సమస్య సమస్యగానే నిలిచిపోతుంది. వీరిలో కొందరు అసలు సాధన, ఆధ్యాత్మికతలే వాస్తవంకాదనే దృష్టికొస్తారు. అలానే ప్రాపంచిక సమస్యల విషయంలోనూ జరుగుతూంటుంది.

ఈ సమస్యకు కారణం మనం ప్రధానమైన ఒక సత్యాన్ని మరవడమే.

ఇంద్రియాలకు మనస్సుకు అతీతమైన పరమాత్మ ఉన్నాడనీ, తినడం, నిద్రపోవడంవంటి ప్రాకృతికమైన క్రియలకంటే జీవితానికి వేరొక పరమార్థమున్నదని, దానిని పొందేందుకు సాధన ఒకటున్నదనీ మానవజాతికి తెల్పిన వారు లేకుంటే మనమంతా పశుప్రాయంగా జీవిస్తుండేవాళ్ళమే. అలా తెల్పినవారిని సద్గురువు అంటారు. భగవంతుని అస్థిత్వాన్ని తాము ప్రత్యక్షంగా అనుభవించి, మనకు నిస్సంశయంగా ఆ విషయాన్ని నిరూపించి, దానిని పొందే మార్గాన్ని స్వానుభవంతో బోధించే వారిని సద్గురువులు అంటారు. మన సనాతనమైన ఆధ్యాత్మిక సంపదయైన వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, భాగవతాది పురాణాలు-యివన్నీ యిట్టి సద్గురువులైన ఋషులవలన మనకు సంక్రమించినాయి. మన ఆధ్యాత్మిక సంపదంతటికీ మూలం వారే. ఇలానే ప్రపంచంలోని మతాలన్నింటికీ అట్టివారే మూలపురుషులు.

ఏ విద్యనభ్యసించాలన్నా అందులో పూర్ణమైన అనుభవాన్ని గడించినవారి సహకారాన్నాశ్రయించాలి. బిడ్డ మాటలు నేర్వడం దగ్గరనుండీ, ఈత, వైద్యశాస్త్రాల నుండీ ఆధ్యాత్మ విద్యవరకూ యిదే మూలసూత్రం. వేదఋషులందరూ యిలా సద్గురుసేవలో తపశ్చర్యను సాధించి వేద ద్రష్టలు కాగలిగారు. వశిష్టుడు, యాజ్ఞవల్క్యుడు, వేదవ్యాసుడు- అందరూ అలాటివారే. అంతే కాదు పరమార్ధసాధన కొరకు శ్రోత్రీయుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువును ఆశ్రయించి తీరాలని ఉపనిషత్తులు చెబుతున్నాయి. అసలు అట్టివారు మాత్రమే ఉపనిషత్తులు భగవద్గీత వంటి ఉత్తమవిద్యను బోధించడానికర్హులని ఆ ప్రామాణిక గ్రంథాలే చెబుతున్నాయి. ఈ సూత్రాన్ని మరవడమే యింత ఆధ్యాత్మిక దృష్టికల ఈ దేశంలో యింత మందికి(వ్యాసారంభంలో ప్రస్తావించిన) సమస్యలెదురవడానికి కారణం.

బ్రహ్మజ్ఞానియైన సద్గురువునాశ్రయించితీరాలని లోకానికి అవతార పురుషులు నొక్కిచెప్పారు. మనమాచరించితీరవలసినమార్గాన్ని తన ఆచరణ ద్వారా చూపిన శ్రీ రామచంద్రుడు విశ్వామిత్రుణ్ణిగురువుగా ఆశ్రయించాడు. తాను ఏ విధమైన యత్నంతోనూ పొందదగినదేదీ ముల్లోకాల్లోనూ లేదని భగవద్గీతలో చెప్పిన శ్రీ కృష్ణ పరమాత్మ- బాల్యంలో తననోట చతుర్దశ భువనాలనూ యశోదకు దర్శనమిచ్చిన శ్రీ కృష్ణుడు- సాందీపని మహర్షికి శిష్యుడై సేవించాడు. అందుకు కారణాన్ని భగవద్గీతలో "యద్యదాచరతి శ్రేష్ఠ:తత్తదేవేతరోజనా:", శ్రేష్ఠుడు దేనినాచరించిన, దానినే యితర జనులాశ్రయిస్తారు(గనుక) " అని చెప్పాడు. తానాచరించి చూపడమేగాక ప్రాణప్రియుడైన అర్జునుడికి గూడా అలానే చేయమని చెబుతాడు:

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానిన: తత్త్వదర్శిన:॥" (అధ్యా. 4: శ్లో. 32)

భావము: "పరమాత్మ తత్త్వాన్ని ప్రత్యక్షానుభవంగా దర్శించిన జ్ఞానులను సేవించి, సాష్టాంగముగ నమస్కరించి, జ్ఞానము కలుగువరకూ చక్కగా ప్రశ్నించు. వారు నీకు జ్ఞానాన్ని బోధిస్తారు. "

బాగా ఆలోచిస్తే యీ శ్లోకమెంత ప్రధానమైనదో అర్థమవుతుంది. సకల ఉపనిషత్తుల సారమూ, బ్రహ్మ విద్యా, సకల యోగసాంప్రదాయముల సారమూ అయిన యీ భగవద్గీత వెలువడడానికి కారణం బ్రహ్మవేత్తలలోను, యోగులలోను అగ్రేసరుడు, పూర్ణావతారమూ అయిన శ్రీ కృష్ణుని అర్జునుడు, "శిష్యస్తేహం శాధిమాం త్వాం ప్రపన్నమ్", 'నేను నీశిష్యుడను; శరణుబొందిన నన్ను రక్షించు" అని ప్రణిపాతము చేసి, పరిప్రశ్న చేయడంవలనగదా గీత ఆవిర్భవించినది? అర్జునుడు అలా చేసేవరకూ కృష్ణుడు కేవలం సారథిగా మాత్రమే వ్యవహరించాడు! అంతేకాదు. అలా ఆశ్రయించదగిన వారెలా ఉండాలోగూడా భగవద్గీత సూచిస్తూన్నది. శ్రీ కృష్ణుడు తానే సకలభూతహృదయాంతర్వర్తినని, యీ విశ్వమెల్లా తన 'విభూతి', లేక మహిమయేననీ, చెప్పినపుడు నమ్మలేని అర్జునునికి విశ్వరూపాన్ని దర్శనమిచ్చి, విశ్వాసాన్ని పటిష్టం చేసాడు. అలా చేయగలవారినే గురువనదగియున్నదని దీని భావం. అంతేకాదు. అటువంటి సద్గురువు ప్రసాదించగల అనుభవమెలాటిది? శ్రీ కృష్ణుడిలా చెప్పాడు: "నన్ను నీవెలాచూచావో అట్టిదర్శనము వేదములచేతగాని, యజ్ఞ దాన తపస్సుల చేతగాని చూడ సాధ్యముగాదు."(అధా. 11 :శ్లో:53). అందుకే ఉపనిషత్తులన్నీ ముముక్షువు ఆత్మజ్ఞానియైన సద్గురువునాశ్రయించాలని చెప్పాయి.

ఆధునికులైన మహనీయుల అనుభవంలోగూడ యిదే కనిపిస్తుంది. వివేకానందునికి రామకృష్ణుడు పాదస్పర్శ చేత ప్రసాదించిన దివ్యానుభూతి వంటిది సద్గురువులేకనే ఎవరైనా పొందినట్లు విన్నామా? రామకృష్ణ పరమహంస జగన్మాతయైన కాళికాదేవి సాక్షాత్కారాన్ని సాధించగలిగినా ఆత్మానుభూతిని పొందడానికి తోతాపురిని ఆశ్రయించమని ఆ దేవియే చెప్పినది. అలానే పండరివిఠలుని సగుణ రూపాన్ని సాక్షాత్కరించుకొన్న నామదేవునితోగూడ నాగనాధ దేవాలయంలోని విశోబాకేశుడనే మహనీయుని ఆశ్రయించి పూర్ణజ్ఞానాన్ని పొందమని విఠలుడే ఆదేశించాడుగదా? బాహ్యాచారాల అన్నింటినీ విమర్శించిన యోగివేమన కూడ సమర్థుడైన గురువునాశ్రయించవలసినదని ఆదేశించాడు. ఏ గురువునూ ఆశ్రయించకనే జ్ఞానియైనట్లు కనిపించిన భగవాన్ రమణ మహర్షిగూడ, "నాకూ ఒక గురువున్నారు. అయితే మీరనుకొన్న విధంగా కాదు" అన్నట్లు 'రమణ దివ్యబాషణలు' (Talks with Bhagawan Ramana) అన్న గ్రంథంలో చూడవచ్చు.

సద్గురువునాశ్రయించని సాధన రక్తికట్టదనడానికి పరిపూర్ణుడైన సద్గురువునాశ్రయించకనే జపపూజాదులు చేసే జనబాహుళ్యంయొక్క అనుభవము ఋజువు. అట్టి గురువునెలా గుర్తుపట్టాలో, ఆశ్రయించాలో బాబా చరిత్రలో చూడవచ్చు.

---

# చీరాల స్వామి

చీరాల స్వామి ఆరాధన ప్రత్యేక వ్యాసం

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

'వివేకచూడామణి' లో ఆదిశంకరులు జీవన్ముక్తులు గురించి వ్రాస్తూ, "బాలోన్మత్తపిశాచవత్" అని వర్ణించారు. అంటే జీవన్ముక్తులు పసిపిల్లలవలెను ఉన్మతుల (పిచ్చివారు) వలెను, పిశాచములవలెను వుంటారని వారి భావం. అందువల్ల వారిని గుర్తు పట్టడం చాలా కష్టం. రమణమహర్షి జ్ఞానిని మరొక జ్ఞాని మాత్రమే గుర్తించగలరని అన్నారు. శిరిడీ సాయిబాబా శిరిడీ చేరిన కొత్తల్లో ఆయన్నెవరూ గుర్తుపట్టలేదు. అక్కల్‌కోట మహరాజ్ పసిపిల్లలవలె రాళ్ళతోనూ, మట్టితోనూ ఆడుకుంటుండేవారు. అవధూత స్వామి కూడా ఒకప్పుడు పసిపిల్లవాడిలాగా, ఇంకొకప్పుడు పిచ్చివాడిలాగా, మరొకప్పుడు దెయ్యం పట్టినవాడిలాగా కన్పించేవారు. ఈ అవధూత స్వామి, అంటే చీరాల స్వామి మురుగు కాలవల ప్రక్కన, రోడ్ల ప్రక్కన మట్టిలోనూ యథేచ్ఛగా కూర్చొని ఒకొక్కప్పుడు మట్టిని గుప్పెళ్ళతో తీసి నెత్తిమీద పోసుకుంటూ వుండేవారు. ఒకొక్కప్పుడు కూర్చున్నవారు కూర్చున్నచోటనే, బట్టలలోనే మూత్ర విసర్జన చేసేవారు. ఆయా సమయాలలో ఆయన పసిపిల్లవాడిలాగా వుండేవారు ఒకొక్క సమయంలో తనలో తాను నవ్వుకుంటూ, తనలోతాను మాట్లాడుకుంటూ, రాత్రులందు అకారణంగా పెద్దగా కేకలు పెడుతూ, గట్టిగా తిట్టరాని తిట్లు తిడుతూ, ఒంటిమీద గుడ్డలు ఉన్నదీ, లేనిదీ గూడ పట్టించుకోకుండా తిరుగుతూ పిచ్చివాడిలాగా వుండేవారు. రాత్రిపూట రోడ్లమీదా, స్మశానాలలో తిరుగుతూ పళ్ళు పటపట కొరుకుతూ, తీవ్రావేశంలో దెయ్యం పట్టినవాడిలాగా వుండేవారు. ఒకొక్కప్పుడు ఆయన చేష్టలు చూస్తున్న నాకు ఆయన కేవలం ఒక పిచ్చి వాడేమోనని, నేనేదో భ్రమిస్తూ ఆయన్ను దర్శిస్తున్నానేమోననీ, అనుమానం కలిగేలా ప్రవర్తిస్తూండేవారు. అయితే యీ అనుమానాల నుంచీ నన్ను కాపాడి సరియైన దృష్టితో చూచేందుకు తోడ్పడ్డ అంశాలు యివి – ఇతర మహాత్ములు ఆయన ఆధ్యాత్మికోన్నతి గురించి చేసిన ప్రశంసలు, ఆయన పూర్వ చరిత్ర గురించి నా పూర్వ పుణ్యవశాత్తూ నాకు తెలిసిన అంశాలూ, భక్తుల అనుభవాలూ.

నేను చీరాల స్వామిని దర్శించడం మొదలుపెట్టిన సంవత్సరానికి సాయికృపవలన జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో పూజ్యపాదులు శ్రీ పూర్ణనంద స్వామివారి దర్శనం నాకు లభించింది. వారు అతి చిన్నవయస్సులోనే భయంకరారణ్య ప్రాంతాలలో తీవ్ర తపస్సువలన పరమేశ్వర సాక్షాత్కారాన్ని పొందిన సాధుపుంగవులు. వీరిప్పుడు శ్రీశైలంవద్ద హఠకేశ్వరంలో ఆశ్రమవాసులై వున్నారు. యీ మధ్యనే సిద్ధిపొందారు. వారిని నేను జిల్లెళ్ళమూడిలో దర్శించినపుడు శ్రీ అవధూత స్వామివారి గూర్చి వారికి చెప్పాను. వారు శ్రీ చీరాల స్వామి నిస్సందేహంగా పరిపూర్ణ జ్ఞానావస్థను పొందిన జీవన్ముక్తులని, వారి దర్శనం గొప్ప పుణ్యఫలమనీ, వారు నాకు ప్రసాదించిన వస్తువులు ఎంతో శక్తివంతాలైనవనీ చెప్పారు. శ్రీ పూర్ణానందులుకూడా తాము శ్రీ అవధూత స్వామిని దర్శించాలన్న కోర్కె వెలిబుచ్చారు.

పరమ రామభక్తులైన శ్రీ రంగన్నబాబుగారు (గుంటూరు) చీరాలలో వుండగా తరచు శ్రీ చీరాల స్వామిని దర్శించి పాదాభివందనం చేసేవారట. శ్రీ చీరాల స్వామిని భక్తులు కొంతకాలం చిలకలూరిపేటలో వుంచినపుడు శ్రీ రంగన్నబాబుగారు ప్రత్యేకంగా అక్కడకు వెళ్ళి స్వామిని దర్శించి వారికి ఫలాదులర్పించి తిరిగి వచ్చారట. నేనొకసారి బాబుగారిని దర్శించినపుడు నాతో ఆయన యిలా అన్నారు; 'చీరాలలో బోదకాలు స్వామిని ఎప్పుడైనా దర్శించారా అయ్యా? ఆయన చాలా గొప్పవారని మా గురువు కోదండ రామస్వామి (శ్రీ రాముడు) నాకు చెప్పారు. నేనొకప్పుడు చీరాల స్వామి ఏమంటారోని ఆయనను, 'మనదేవూరు స్వామీ?' అనడిగాను. అందుకాయన నాకేసి చూచి, 'అందరిదీ ఒకే ఊరులే' అన్నారు. ఆయనకు ఖండయోగం కూడా వచ్చయ్యా. ఒకనాటి రాత్రి ఆయన శరీరం ఖండఖండాలుగా స్వర్ణ(ఊరిపేరు) గేటు సమీపంలో పడి వుండగా స్వయంగా చూచాను. తిరిగి మరురోజు ఉదయం ఆయన ఎప్పటిలాగా చీరాల రోడ్లమీద తిరుగుతున్నారు" అన్నారు.

చీరాల వాస్తవ్యులైన వైద్య ప్రభాకర, వైద్యాచార్య వృశ్చిక యంత్ర ప్రవీణ, సిద్ధవైద్య శ్రీ సాంబశివరావుగారు శ్రీ చీరాల స్వామితో తమకుగల అనుభవాలను నాకు యిలా లేఖగా వ్రాశారు. వాటిని యథాతథంగా ఈ క్రింది పొందుపరుస్తున్నాను:-

శ్రీశ్రీశ్రీ రమణానందులు లేక షణ్ముఖులు(చీరాల స్వామివారు) చిత్తూరు జిల్లాకు చెందినవారు. 1941 సం॥నుండి శ్రీ వారు నాకు బాగా తెలుసు! 1941, 42 ప్రాంతాలలో నేను విజయవాడలో నుండగా నాకు వీరి ప్రథమ దర్శన భాగ్యం లభించింది. అప్పుడు వీరికి బోదకాలు లేదు. వీరు ఎవరిని ఏమీ యాచించేవారు కాదు. ఎవ్వరితో మాట్లాడేవారుకూడా కారు. ఎక్కడ పడితే అక్కడే కూర్చుని వుండేవారు. మనం రెక్కపట్టుకొని తీసుకెళ్తే పసిపిల్లవానికివలె కూడా వచ్చేవారు. మనమేదైనా ఆహారం పెడితే చాలా కొద్దిగా మాత్రమే తినేవారు. ఒక్కొక్కప్పుడు యోగసమాధిలో నడిరోడ్డుమీద పడుకుని వుండేవారు. కారువాళ్ళు హరన్ కొట్టినా, అరచినా ఈయన పలికేవారు కారు. అప్పుడు కారులోవాళ్ళు దిగివచ్చి ఈయనను తీసుకుపోయి మరొకచోట పడుకోబెట్టేవారు. శ్రీ స్వామి ఎప్పుడూ రెప్పవాల్చక గుడ్డు

కదిలించక గంటలు తరబడి యోగ ముద్రలో వుంటూండేవారు. ఒకసారి నేను వీరిని చూచేసరికి ఈయన విజయవాడలో గట్టువెనుక విద్యాధరపురంలో (1) లో పడుకుని వున్నారు. అప్పుడు వర్షం బాగా కురుస్తోంది. కంటిగుడ్లమీద కూడ చినుకులు పడుతున్నాయ్. కానీ స్వామి కళ్ళు తెరుచుకునే వున్నారు. నాకప్పుడు ఈయనలో ప్రాణం వున్నదా? లేదా అనే సందేహం కలిగి దగ్గరకుపోయి తిన్నగా తట్టి చూశాను. కొంచెం కదలిక కన్పించింది. ఇదేంటి స్వామి అని రెక్కపట్టుకు లేవదీసి నా గదికి రమ్మని ప్రార్థించాను. కాని స్వామి ఏమీలేదని చెప్పి నా గదికి రావడానికి నిరాకరించి ఆ వర్షంలోనే అలాగే పడుకున్నారు. నా ప్రయత్నం విఫలమైంది. మళ్ళీ ఒకసారి స్వామి నాకు దుర్గాలయం (దుర్గకొండ) దగ్గర దర్శనమిచ్చారు. నేను కొండ మెట్లెక్కుతుండగా ఈయన నన్ను వెనక్కు పిలిచి, "నీవు యీవూళ్ళో వుండవు. నీకు శుభం కలుగుతుంది" అని చెప్పారు. ఆయన చెప్పినట్లే ఒక నెల రోజులలో నేను ఉద్యోగము చేయు కంపెనీవారితో దెబ్బలాడి ఉద్యోగానికి రాజీనామా యిచ్చి యింటికి వచ్చాను. నేను వూరికి వచ్చేటప్పుడు. శ్రీ వారి కోసం వెదకి లక్ష్మీపేటలో ఆయనను కలుసుకున్నాను. వారు చిరునవ్వుతో నన్ను చాలా ఆదరంగా చూచారు. వారి చేతిలో వున్న పండు నాకు ప్రసాదమిచ్చి, "నీకు యోగసామ్రాజ్యమబ్బుతుంది" అన్నారు. తర్వాత ఒక మాసము రోజులకే శ్రీశ్రీశ్రీ గోపానంద నాధులవారి దర్శనం నాకు లభించలేదు. 1961 జూన్ 15వ తేదిన స్వామి నాకు చిలకలూరిపేటలో పున: దర్శనం ప్రసాదించారు. 'మీరు నాకు యోగదీక్ష నివ్వలేదే' మని నేను స్వామినడగ్గా స్వామి 'మీ గురుశిష్యులు కొన్ని జన్మలుగా గురుశిష్యులుగా వస్తున్నారు. అది భిన్నము' అని చెప్పారు. అప్పటికి ఆయనకు కొద్దిగా బోదకాలు కనిపిస్తోంది. తర్వాత 1965-66లో చీరాలలో నాకాయన కనిపించారు. 'బాగున్నావా?' అనడిగారు. నేను నమస్కారం చేశాను. వారు చిరునవ్వు నవ్వి నాకు కాల్చుకోటానికి సిగరెట్టిచ్చారు. 'మనం చీరాలలో వుందామా?' అన్నారాయన. నేనప్పుడు త్రిపురాంతకంలో వైద్యం చేస్తున్నాను. ఏ కారణమూ లేకుండానే తర్వాత నేను చీరాల నివాసినయ్యాను. అప్పటినుంచి స్వామి వారితో నాకు పూర్తి పరిచయమేర్పడింది. నేను అప్పుడప్పుడు స్వామిని ఏవేవో ప్రశ్నలు అడుగుతుంటే తాను చిత్తూరు జిల్లావాసినని, కొంతకాలం కడపలో వున్నానని, ఎక్కువకాలం రమణాశ్రమంలో గడిపానని, రమణమహర్షి దర్శనమంటే తనకు చాలా యిష్టమని, తనను 'రమణానంద' అని పిలిస్తే సంతోషిస్తానని చెప్పారాయన. శ్రీ చీరాల కృష్ణమూర్తిగారికి వారు సుపరిచితులు. స్వామి ఏంకోరితే అదల్లా కృష్ణమూర్తిగారు సమకూర్చేవారు. ఎక్కువగా కాఫీ, భోజనం యిస్తూండేవారు. ఒకప్పుడు వారు శ్రీవారిని ఏమైనా చెప్పమని వెంబడించారట. శ్రీవారు దుర్గంధ భూయిష్టమైన నీరు తాగుతూ, కృష్ణమూర్తిగారిని కూడా తాగమన్నారట. ఆయన తాగలేక పోయారట. అప్పుడు శ్రీవారు చిరునవ్వు నవ్వి యింటికి వచ్చారట. తర్వాత కొన్నాళ్ళకు కృష్ణమూర్తిగారికి జబ్బుచేసి మరణించారు. ఆయన మరణించటానికి మూడు రోజులు ముందుగానే స్వామి – 'ఇంక కృష్ణమూర్తిగారు మూడు రోజులుకంటె బ్రతకరు, అని చెప్పారు. నేను నా అనుభవంలోని స్వామివారి మహిమనొకదానిని చూశాను. నా శరీరం బలహీనమై ఎన్ని మందులు తిన్నా స్వస్థత చేకూరటం లేదు. ఒకరోజు నేను స్వామి దగ్గరకు వెళ్ళి నా సంగతి చెప్పుకున్నాను. ఆయన ఒక చుట్ట నాకిచ్చి కాల్చమన్నారు. అది తాగగానే నా గుండెల్లో నొప్పి తగ్గి నాకు మంచి ఆరోగ్యం చేకూరింది. శ్రీ వారు సహజంగా వారి చేతిగుండా ఏదైనా యిస్తే ఆ వ్యక్తికి అక్కర తీరేటంత డబ్బు వస్తుంది. ఇది నా స్వానుభవం ఒక్కొక్కప్పుడు స్వామి పరీక్షలు కూడా పెడుతుంటారు. అవి తట్టుకోటం కొంచెం కష్టం. శ్రీ కృష్ణమూర్తిగారు యిదివరకు స్వామిని చూసుకున్న విధంగా శ్రీ రామరావు గారు కూడా వారి సేవయందు నిమగ్నులై శ్రీ వారిని దైవస్వరూపులుగా పూజిస్తున్నారు. శ్రీవారు యోగసిద్ధులు, అణిమాద్యష్టైశ్వర్య సంభూతులు,పూర్ణయోగులు,ఆయన గురించి తెలుసుకున్న కొద్దీ తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో మిగిలే ఉంటాయి. కనుక ఇప్పటికి నాకు తెలిసిన వాటితో యిక ముగిస్తున్నాను"

3-9-74న చీరాలలో శ్రీ స్వామివారి ఆరాధన జరిగింది. ఆ రోజు వేటపాలెం వాస్తవ్యులు, అనేక సత్పురుషుల సేవ చేసినవారు అయిన శ్రీ రాజుపాలెం రామచంద్రరావుగారు నాకొక కొత్త సమాచారం తెలియజేశారు. కొంతకాలం క్రిందట రామచంద్రరావుగారు 'పశుములై స్వామి' అని కీర్తినోందిన శ్రీ లలితానందులు అను సిద్ధపురుషుల సేవాసాంగత్యాలను పొందిన భాగ్యశాలి. ఒకసారి శ్రీ లలితానందులు రామచంద్రరావుగారితో యిలా అన్నారట: "మీ ఊళ్ళో రోడ్లమీద తిరుగుతూ వుండే బోదకాలు స్వామి చాలా గొప్పవారు, సిద్ధపురుషులు. ఆయనే ఆ ఊళ్ళో లేకపోతే ఆ ఊళ్ళో చాలామంది రోగాది బాధలతో అలమటించేవారు. ఆయనవల్లనే ఆ ఊరు అంతమాత్రంగా నిలిచింది" అని.

**ఆచార్య భరద్వాజులు రచించిన "అవదూత శ్రీ చీరాల స్వామి చరిత్ర" సౌజన్యంతో**

---

# శ్రీ గజానన్ మహరాజ్

## అవధూత శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధన ప్రత్యేక వ్యాసం

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

అది 1878వ సంవత్సరము. ఫిబ్రవరి 23వ తేది. మహారాష్ట్రలోని షేగాం అనే గ్రామములో ఒక ధనవంతుని యింట బ్రాహ్మణ సమారాధన జరుగుతున్నది. ఎంగిలివిస్తళ్ళు దారిప్రక్కన పారవేస్తున్నారు. వెంకట్, దామోదర్ అనేవారు ఆ ఆకుల్లో మిగిలిన మెతుకులకోసం చేరిన కుక్కలమధ్య దిగంబరంగా కూర్చొని వాటితోపాటు ఎంగిలి మెతుకులు తింటున్న 16 ఏళ్ళ యువకుణ్ణి గమనించారు. ఆ వ్యక్తి ముఖవర్చస్సు చూడగానే వారికి శ్రీ దత్తాత్రేయులవారు గుర్తొచ్చారు. వారతనిని పిలిచి మంచి భోజనము పెట్టించారు. అతడు రుచినేమాత్రం పట్టించుకోక అన్నింటిని ఒకటిగాకలిపి, కొంచెంతిని, ప్రక్కనేయున్న మురికిగుంటలోని నీటితో తనదాహం తీర్చుకున్నాడు.

అనతికాలంలో ఆ యువకుడే "శ్రీ గజానన్ మహరాజ్"గా ప్రసిద్ధికెక్కారు. ఆయన ఎప్పుడూ "గణ్ గణత్ ఘోటే గణాగణ్ గణాత్ బోటే" అంటూ వుండేవారు. అందుకనే ఆయనను ప్రజలు గజానన్ మహరాజ్‌యని పిలిచేవారు. నిజానికి ఆయనెవరో, పేరేమిటో, ఊరేమిటో, ఎక్కడ ఎప్పుడు ఎవరికిపుట్టారో తెలిసిన వారెవరూలేరు.

చాలాకాలంవరకు ప్రజలాయనను పిచ్చివాడిక్రింద జమకట్టారు. ఒకరోజు ఒక హరిదాసు దేవాలయంలో సొంపుగా భజనలుపాడి తరువాత "హంసగీత" అనే ఆధ్యాత్మిక గ్రంథములోని కొన్ని శ్లోకాలు పాడాడు. బయటనుండి ఎవరో ఆ తరువాత శ్లోకాన్ని అతి శ్రావ్యంగా, స్పష్టంగా పాడడం విని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ స్వర–ఉచ్ఛారణకు సమ్మోహితుడైన హరిదాసు బయటకు వెళ్ళిచూస్తే ఆ 'పిచ్చి' గజాననే వున్నాడు. హరిదాసు ఆయనను లోపలకాహ్వానించగా "లోపలైతేనేం, బయటైతేనేం? భగవంతుడు సర్వవ్యాపకుడని యిప్పుడేగా శ్లోకం చదివావు?" అన్న గజానన్ మాటలు హరిదాసులో చిత్రమైన పరివర్తన తీసికొచ్చాయి. అప్పటినుండి అతడు ధనంకోసంకాక భగవంతుడిపట్ల ప్రేమతో హరికథలు చెప్పేవాడు.

అది మే మాసం. ఎండలు మండిపోతున్నాయి. ఆ సాధువు రోడ్లమ్మట తిరుగుతూ భాస్కర్ అనే ధనికుడి యింట ప్రవేశించి త్రాగడానికి నీరడిగాడు. భాస్కర్ "తిండికోసం యితరులపై ఆధారపడి సోమరులుగా తిరిగే నీలాంటి వారికి సహాయంచేయడం మహాపాపం. నీళ్ళు యింకెక్కడన్నా అడుగుపో" అని కసిరాడు. శ్రీ గజానన్ ఏమీ మాట్లాడక వెళ్ళి ప్రక్కనేవున్న బావిలో చూడగా అది ఎండిపోయివున్నది. అదిచూచి భాస్కర్ "మూర్ఖుడా! నీకిక్కడెక్కడా నీరు దొరకదు" అన్నాడు. శ్రీ గజానన్ మౌనంగా ఆ బావివద్ద కూర్చొని తీవ్ర ధ్యానంలో మునిగిపోయారు. కాసేపట్లో బావి అంచులదాకా నీరు నిండింది! భాస్కర్ అవాక్కయ్యాడు. తన మూర్ఖత్వాన్ని క్షమించమని ఆయనను ప్రార్థించి తన జీవితాన్ని ఆయనసేవకే వినియోగించాలని నిశ్చయించుకొన్నాడు.

షేగావ్‌లో వెంకట్ అనే భక్తుడు తనతోటలో సత్సంగం ఏర్పాటుచేసి శ్రీ గజానన్ మహరాజ్‌ను భక్తులతోసహా ఆహ్వానించారు. అందరూ సమావేశమయ్యాక మొక్కజొన్నలు కాల్చడానికై మంటవేశారు. పైకిలేచిన మంట చెట్టుకొమ్మకు వ్రేలాడుతున్న తేనెతుట్టెలోని ఈగలను కదల్చడంతో తేనెటీగలు భక్తులను కుట్టసాగేసరికి వారంతా చెల్లాచెదురుగా పరిగెత్తారు. శ్రీ గజానన్ మహరాజ్ మాత్రం తేనెటీగలు తమను కసితీరేలా కుడుతూవుంటే కదలకుండా కూర్చోవడంచూచి, వెంకట్ దు:ఖముతో చలించిపోయి ఆయనవద్దకు పరుగెత్తుకొచ్చాడు. మౌనంగా శ్రీ గజానన్ మహరాజ్ యిచ్చిన ఆజ్ఞను పాటిస్తున్నాయా అన్నట్లు తేనెటీగలు వెళ్ళిపోయాయి. వాచిపోయిన స్వామి శరీరానికి ఎన్నోమందులుపూశాడు వెంకట్. కానీ ఫలితం శూన్యం. చివరకు శ్రీ గజానన్ ఒకవిధమైన యోగాసనంలో కూర్చోవడంతో ఆయన శరీరమంతటా గ్రుచ్చుకొనిపోయిన తేనెటీగల ముండ్లన్నీ జలజలా రాలిపోయి శరీరం యధాపూర్వకంగా తయారైంది. అప్పుడు భక్తులాయనవద్దచేరి కాలిన మొక్కజొన్నలను తృప్తిగాతిన్నారు.

ఒకసారి శ్రీ గజానన్ మహరాజ్ వెంకట్‌తో చిలిం వెలిగించుకోడానికి నిప్పుతెమ్మన్నారు. అక్కడ నిప్పులేకపోయేసరికి దగ్గరలోగల కమ్మరి వద్దకువెళ్ళి కొలిమిలోని నిప్పు యివ్వమన్నాడు వెంకట్. ఆ నిప్పు శ్రీ గజానన్ మహరాజ్‌కోసమని తెలిసి ఆ కమ్మరి శ్రీ గజానన్ సమాజానికి భారమనీ, ఆయనవల్ల ఏ ఉపయోగములేదని నిందిస్తూ నిప్పు ఇవ్వ నిరాకరించాడు. శ్రీ గజానన్ మహరాజ్ వెంకట్‌ను పిలిచి కాలిన అగ్గిపుల్లనొకదానిని తన చిలుముపై వుంచమన్నారు. అతడలాచేయగా శ్రీ గజానన్ చిలుముపీల్చారు. అగ్గిపుల్ల మండి చిలింనుంచి పొగరాసాగింది. అరోజే ఆ కమ్మరి తన బంధువులకు విందుచేయగా వడ్డించిన పదార్థాలు కుళ్ళుకంపువేశాయి. బంధువులంతా కమ్మరిని నిందించి భోంచేయకనే కోపంగా వెళ్ళిపోయారు. మహాత్ముడైన శ్రీ గజానన్ మహరాజ్‌పట్ల తన మూర్ఖప్రవర్తనే యిలా జరగడానికి కారణమని తలచిన కమ్మరి ఆయన సన్నిధిచేరి క్షమార్పణకోరాడు. శ్రీ గజానన్ చెడువాసనవేస్తున్న ఆ పదార్థాలను తెప్పించి వాటికేసి కాసేపుచూడగా అవన్నీ ఘుమఘుమలాడే సువాసనలు వెదజల్లాయి. కమ్మరివానిని తీసుకువెళ్ళి మరలా విందుచేశాడు.

అతిథులు తృప్తిగాభోంచేసి శ్రీ గజానన్ మహిమను కొనియాడారు.

ఒకరోజు గజానన్ మహరాజ్ ఒక ఆలయంలో కళ్ళుమూసుకొని నిశ్చలంగా కూర్చొన్నారు. ఆ ఊరి పాటిల్ కొడుకులు ఉత్త కోతిమూక. శ్రీ గజానన్ మహరాజ్ ధ్యానాన్ని భగ్నంచేయడానికి వారెన్నో ప్రయత్నాలుచేసి విసిగిపోయి చివరకు ప్రక్కపొలాలనుండి చెఱకుగడలుతెచ్చి అర్ధగంటసేపు ఆయనను తమ బలమంతటితో బాదసాగారు. శ్రీ గజానన్ మహరాజ్ చలించలేదు! నగ్నంగా వున్న వారిదేహంపై ఆ దెబ్బలగుర్తులు సైతం ఏర్పడలేదు!! దాంతో ఆ పిల్లలు భయపడి వినయంగా శ్రీ గజానన్ మహరాజ్‌కు ప్రణమిల్లారు. ఆయన మెల్లగా కళ్ళుతెరచి మెత్తటిస్వరంతో, "అబ్బాయిలూ, మీరు బాగా అలసిపోయారు. వుండండి, ఇది తీసుకోండి" అంటూ చెఱకుగడలను చేతిలోపిండి ఒక పాత్రనిండా రసంతీసి త్రాగమని ఆ పిల్లలకిచ్చారు. నిజమైన అహింస బలవంతులకే చెల్లుతుంది. నిజమైన ప్రేమ అన్నది శత్రువులనుకూడా ఆదరిస్తుంది.

శ్రీ నరసింగ్ అనే గొప్ప సాధువు తీవ్ర యోగసాధనచేయడానికై ఆ ఊరి పరిసరాలలోని అడవులకు వెళ్ళారు. అతడు విఠలుని భక్తుడు. ఒకరోజు శ్రీ గజానన్ హఠాత్తుగా అతనికి దర్శనమిచ్చారు. కళ్ళుమూసుకొని ధ్యానంలో వున్న ఆ సాధువుకు దివ్యమైన కాంతి దర్శనమై కళ్ళుతెరచిచూడగా పండరివిఠలుడే తనముందు నిలబడియున్నారు. అతడు విఠలునికి సాష్టాంగపడి లేచిచూడగా శ్రీ గజానన్ మహరాజ్ నవ్వుతూ నిలబడికనిపించారు. ఆయన ఆ సాధువుతో "నీకు పూర్ణవైరాగ్యము అబ్బింది. ఇకపై నీరు, బురద అంటక చెఱువులో నిలచియుండే తామరపూవులా జీవించు. నీకు జ్ఞానం ప్రసాదించటానికై విఠలుడే నన్ను పంపించాడు" అన్నారు.

ఒకసారి శ్రీ గజానన్ కూర్చునివున్న శివాలయానికి కొందరు సాధువులు వచ్చారు. ఆరోజు సాయంత్రం ఆ సాధువులలో పెద్దవాడైన బ్రహ్మగిరి భగవద్గీతలోని సాంఖ్యయోగాన్ని వివరిస్తూ శరీరం భ్రాంతి జన్యం–దానికేమీ ప్రాముఖ్యములేదు అన్నాడు. ఇదివిన్న స్వామిభక్తులు, "ఆధ్యాత్మిక సాధనకు శరీరం అత్యావశ్యకమే, మరి ఈయన యిలా అంటాడేమిట"ని తలచాడు. ఇంతలో బ్రహ్మగిరి, శ్రీ గజానన్ కూర్చొనియున్న మంచం అంటుకొన్నది. అందరూ దూరంగా పరిగెత్తారు. బ్రహ్మగిరి సైతం లేచి పరుగెత్తబోగా, మండుతున్న మంచముపై నిశ్చలంగా కూర్చొనియున్న శ్రీ గజానన్ మహరాజ్ అతనిని చేయిపట్టి నిలిపి "శరీరం ఉత్తభ్రాంతి, ఆత్మ శాశ్వతమైనది కదా! ఎందుకు పరుగెడతావ్" అన్నారు. ఆ సాధువు భయంతో "స్వామీ! స్వానుభవంలో లేనివిషయాన్నిగూర్చి మాట్లాడినందుకు నన్ను క్షమించి కాపాడండి" అని బ్రతిమిలాడగా శ్రీ గజానన్ అతనిని విడచిపెట్టారు. తాము మాత్రం భక్తులు పరుగెత్తుకువచ్చి తమను దానిపైనుండి తొలగించేవరకు మంచముపైనే వున్నారు. మంటలారిన తరువాత చూస్తే శ్రీ గజానన్ మహరాజ్ కూర్చొనియుండిన భాగం మాత్రం కాలలేదు! బ్రహ్మగిరి తన తప్పుకు సిగ్గుపడి ఆచోటువిడిచి వెళ్ళిపోయాడు. ప్రజలకు కలిగిన అనుమానంలోని సత్యాన్ని శ్రీ గజానన్ మహరాజ్ ఈ విధంగా ఋజువుచేశారు.

శ్రీ సాయిబాబా, శ్రీ అక్కల్‌కోటస్వామి చరిత్రలలోవలె జంతువులపైకూడా శ్రీ గజానన్ మహరాజ్ దివ్యత్వం యొక్క ప్రభావము వుండేది. తక్లీకర్ అనేవానికి ఒక పొగరుబోతు గుఱ్ఱం వుండేది. అది జనాలను తన్నేది, కఱచేది. దాని అపఖ్యాతి ఎంతగా వ్యాపించిందంటే తక్లీకర్ దానిని అమ్మినా కొనేవారు దొరకలేదు. దానివల్ల ఏ ఉపయోగములేదు. చివరికి అతను విసిగి దానిని శ్రీ గజానన్ మహరాజ్ వద్దకు తెస్తూండగా దారిలో చీకటిపడింది. దానిని యినుపగొలుసులతో జాగ్రత్తగా కట్టివేసి అతడు నిద్రించాడు. అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువవచ్చి చూడగా గుఱ్ఱం గొలుసులు తెంపుకొనివెళ్ళి దూరంగా ఒకచోట నిశ్చలంగా నిలబడివుంది. దాని కాళ్ళమధ్య పడుకొని నిద్రస్తున్నారు శ్రీ గజానన్! తెల్లవారగానే శ్రీ గజానన్ మహరాజ్ లేచి వెళ్ళిపోయారు. పొగరుతగ్గి సాధువుగా మారిన గుఱ్ఱం తక్లీకర్ వెంట ఇంటికి నడిచింది.

పీతాంబర్ అనేవాడు తన సర్వస్వం విడచి శ్రీ గజానన్ మహరాజ్ సేవకంకితమయ్యాడు. ఒకరోజు శ్రీ గజానన్ అతనికి పీతాంబరాలు (పసుపురంగు పట్టువస్త్రాలు) యిచ్చి "ఇతరులేమన్నా పట్టించుకోకు. నాసేవకు తగినవాడవు నీవే" అన్నారు. ఇతర భక్తులు అసూయతో అతనిని బాధించారు. ఒకరోజు శ్రీ గజానన్ మహరాజ్ అతనిని పిలచి, "ఇక్కడ అందరూ నిన్ను నిందిస్తున్నారు. నీవు షేగావ్ విడచివెళ్ళు. ఇది నా ఆజ్ఞ" అన్నారు. గురువునుంచి దూరమవుతున్నందుకు పీతాంబర్ ఎంతో దు:ఖిస్తూవెళ్ళి రాత్రయ్యేసరికి 'కొంథాలీ' అనే గ్రామంచేరి ఒక చెట్టుక్రింద నిద్రించారు. మరుసటి ఉదయం ఊరివారాతనిని పలుకరించి "నీవు నిజంగా శ్రీ గజానన్ శిష్యుడవైతే ఆ ఎండినచెట్టును చిగురింపచేయాలి" అని నిలదీశారు. పీతాంబర్ తన గురువును మనసారా ధ్యానించాడు. మరుసటి ఉదయానికంతా ఆమ్రోడు చిగురించింది. దాంతో జనం పీతాంబర్ కాళ్ళపైపడి "జయ సద్గురు పీతాంబర్ మహరాజ్" అని కీర్తిస్తూ ఊరేగించి

గ్రామంలోనే నివాసమేర్పరచారు.

ఒకసారి శ్రీ గజానన్ మహరాజ్ పండరిపురం వెళ్ళి అక్కడ ఒక ఇంటివాకిట కూర్చున్నారు. భక్తులంతా ఆలయానికి వెళ్ళారు. వారిలో బాపూ అను భక్తుడు ఆ రద్దీలో పాండురంగని దర్శించలేక తిరిగి శ్రీ గజానన్ సన్నిధికిచేరి విఠలుని దర్శనముకాలేదని వాపోయాడు. శ్రీ గజానన్ అతనిని పూరడిస్తూ "విఠలుడాలయంలోనే వున్నాడనుకోకు. జాగ్రత్తగా నాకేసిచూడు" అన్నారు. అలా చూస్తున్న బాపూకు తన గురుస్థానంలో విఠలుడే దర్శనమిచ్చాడు. తృప్తికలిగిన మరుక్షణమే విఠలుని స్థానంలో తన గురువు కనిపించారు. అందుకే "గురుగీత" గురువే సకల దేవతలు అనిచెపుతుంది.

శ్రీ గజానన్ మహరాజ్ అకోలాలో వున్నప్పుడు మూర్తిజాపూర్ సమీపంలోని 'కురుం' గ్రామానికి చెందిన మెహతాబ్‌షా అనే ముస్లిం సాధువు శ్రీ గజానన్ మహరాజ్‌నుండి ఆంతర్యంగా తనకందిన పిలుపుననుసరించి వారి దర్శనానికొచ్చారు. శ్రీ గజానన్ మహరాజ్ అతనివైపు వడిగానడిచి "మతకలహాలు రూపాపో జాగ్రత్త! మతాలు వేరైనా మానవులు ఒక్కటే. అందరూ దేవునిసంతానమే" అని అతని చెంపపైకొట్టి, "సాధువైనందుకు అందరిపై ప్రేమవహించు. సాధులక్షణాలను అలవరచుకో" అన్నారు కోపంగా. ఇంతలో బచ్చూలాల్ అనే భక్తుడు శ్రీ గజానన్ కొరకై ఒక బండినిపంపి ఆయనను తన ఇంటికాహ్వానించాడు. బండి ఎక్కివెళ్ళిన శ్రీ గజానన్ తీరా అతనింటివద్ద బండి దిగడానికి నిరాకరించారు. బచ్చూలాల్ తన తప్పు తెలుసుకొని వెంటనేవెళ్ళి మెహతాబ్‌షాను భోజనానికి ఆహ్వానించాడు. కానీ ముస్లిం అయినందున ఆయనను తన ఇంటి సమీపంలోని మసీదులో కూర్చొని భుజించమని ప్రార్థించాడు. వెంటనే శ్రీ గజానన్‌కూడా తనముందు వడ్డించిన పళ్ళెంతోపాటు లేచివెళ్ళి ఆ ఫకీరువద్ద కూర్చొని కలసి భోంచేశారు. భోజనము చేస్తూన్నంతసేపూ వారిద్దరూ ఒకరినొకరు ప్రేమగా చూచుకుంటున్నారు. ఆ తరువాతా ఫకీరు తన నలుగురి సేవకులను పిలచి వారితో "నేను లాహోరు వెళుతున్నాను. 'కురుం'లో మసీదు కట్టించటంయందు నాకాసక్తిలేదు. శ్రీ గజానన్ ఆజ్ఞను దాటడం నావల్లకాదు. మీరు వెళ్ళవచ్చు" అనిచెప్పి పంపి తాను లాహోరు వెళ్లిపోయారు. కానీ చిత్రమేమిటంటే శ్రీ గజానన్ మహరాజే స్వయంగా ఆ గ్రామంలో మసీదుకట్టించారు. మరి భగవంతుడు హిందువా? ముస్లిమా?

బాలాపూర్ నివాసి బాలక్రిష్ణ అనేవాడు ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసస్వామికి భక్తుడు. ప్రతి సంవత్సరం వారి మహాసమాధి దినమైన దాసనవమికి సజ్జన్‌గఢ్ వెళ్ళేవాడు బాలక్రిష్ణ. వృద్ధుడైన తరువాత బలహీనత కారణంగా ఒకసారలా వెళ్ళలేక తన గురువును తన యింటనే దర్శనం యివ్వవలసినది కన్నీళ్ళతో ప్రార్థించసాగాడు. ప్రార్థన మధ్యలో అతనికి నిద్రతూగింది. నిద్రలో ఒక కల. అందులో శ్రీ రామదాసస్వామి కనిపించి "బాధపడకు. నీ ఇంట్లోనే నీకు దర్శనమిస్తాను" అన్నారు. మరుసటిరోజు దాసనవమి. బాలక్రిష్ణ తన గురువుకోసం కళ్ళు ఇంతచేసుకొని చూస్తున్నాడు. మధ్యాహ్నం వాకిటముందు 'జయ రఘువీర సమర్థ్' అని వినిపించింది. పరుగెత్తుకొనివెళ్ళి చూచిన బాలక్రిష్ణ వాకిట కనిపించిన శ్రీ గజానన్ మహరాజ్‌ను సగౌరవంగా ఇంట్లోకి ఆహ్వానించి, పూజాదులుచేసి ఆతిథ్యంయిచ్చాడు. అయినా అతని మనసులో తన గురువురాని కొరత మిగిలిపోయింది. తిరిగి ఆరాత్రి రామదాసస్వామి అతని కలలో కనిపించి తమకు, శ్రీ గజానన్‌కు భేదంలేదని చెప్పడంతో కళ్ళుతెరచిన బాలక్రిష్ణ నాటినుండి శ్రీ గజానన్‌ను తన గురువు అవతారంగా పూజించసాగాడు.

అది 1909వ సంవత్సరం. శ్రీ గజానన్ ఆరోగ్యం క్షీణించసాగింది. ఆరోజు వినాయకచవితి కావడంతో శ్రీ గజానన్ మహరాజ్ భక్తులందరినీ పిలచి "భక్తితో పూజచేయండి. ఆ తరువాత విగ్రహాన్ని నీటిలో కలపండి" అని చెప్పారు. భక్తులంతా ఏక కంఠంతో "మీరే మా గణేశులు. మీకే పూజచేస్తాం" అని ఆయనను పూజించారు. మరుసటి ఉదయం తిరిగి అందరి భక్తులను సమావేశపరచి శ్రీ గజానన్ యిలా అన్నారు – "ఈ దేహయాత్ర చాలించబోతున్నాము. మీలో ఎవ్వరూ దు:ఖించకూడదు. నేనెప్పుడూ మీతోవుంటాను" – అని వారు పద్మాసనంలో కూర్చున్నారు. కాసేపటికి శరీరం చల్లబడి బిరుసెక్కింది. సూర్యుదస్తమించాడు. తరువాత భక్తులు ఆయన దేహాన్ని వూరేగించి ఆశ్రమంలో వారు ముందుగా సూచించివున్న ప్రదేశంలో సమాధిచేశారు. తమ పేరేమిటో ఎవరికీ తెలియని ఆయన నామ రూపరహితమైన తత్త్వంగా నిలిచారు.



# శ్రీ సాయి సచ్చరిత్ర



మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు — ఆగస్టు సంచిక తరువాయి

స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ — అధ్యాయం - 51

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః,

శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః శ్రీ సద్గురు సాయినాథాయ నమః



భక్తులకు ఆశ్రయమైన శ్రీ సాయిబాబా! మీకు జయము జయము. భగవద్గీతార్థాన్ని చక్కగా వివరించిన గురువర్యా! సర్వసిద్ధిప్రదాతా! ప్రభూ! మాపై మీ కృప జూపుము(1). సూర్యుని వలన వచ్చే వేడినుండి రక్షించడానికి మలయపర్వతం మీద చందన వృక్షాలు పెరుగుతాయి. సకల జీవుల శ్రేయస్సు కోసం మేఘాలు వర్షిస్తాయి(2). భగవంతుని పూజ కొరకు పుష్పాలు వికసిస్తాయి. అదే విధంగా శ్రోతలను ఆనందపరచడానికి ఈ సాయి కధాపరంపరలు ఉదయిస్తున్నాయి(3). ఈ సాయి చరిత్ర శ్రవణం చేస్తే శ్రోతలు, వక్త గూడ పవిత్రులవుతారు. ఈ చరిత్రను వినేవారి చెవులు, చెప్పేవారి నోరూ పవిత్రమవుతాయి(4).

గత అధ్యాయంలో అజ్ఞాన నిరసనమవుతే జ్ఞానం ఎలా స్వయంగా ప్రకటమవుతుందోనన్న విషయం 'తత్విద్ధి ప్రణిపాతేన' అన్న శ్లోకం ద్వారా వ్యాఖ్యానించడం జరిగింది(5). భగవద్గీత(18) పద్ధెనిమిదవ అధ్యాయంలోని చివరిదైన డెబ్బదిరెండవ(72) శ్లోకంలో శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుని యిలా ప్రశ్నిస్తాడు(6). "అర్జునా! ఇప్పటి వరకూ నేను చెప్పినది విన్నావు గదా! మరీ నీకు మోహం తొలగిపోయిందా?" 'కానీ నీకు ఆత్మజ్ఞానం కలిగిందా?' అని మాత్రం అడగలేదు(7). అలాగే అర్జునుడు కూడా 'నా మోహం తొలగిపోయింది' అని సమాధానమిచ్చాడేగాని 'జ్ఞానం లభించింది' అని చెప్పలేదు(8). మోహం అంటే అజ్ఞానమే. మోహము, అజ్ఞానము– ఈ రెండింటి అర్ధం ఒక్కటే. భగవద్గీత తెలిసినవారికి వీటి అర్ధం అవగతమవుతుంది(9). పదకొండవ అధ్యాయం మొదట్లోనే అర్జునుడు, "నీవు చెప్పిన మాటలతో నా మోహం నశించింది" అని చెప్పాడు(10).

ప్రస్తుతం ఈ అధ్యాయంలో కాకాసాహెబ్ దీక్షిత్‌ను బాబా శిరిడీలో ఎలా స్థిరపరచారు? అన్న అద్భుతమైన విషయం గూర్చి చెప్పుకుందాము(11). అతనికి శిరిడీలో గల ఋణానుబంధము, సాయిబాబాతో అతనికి గల దృఢ సంబంధమువేర్పడడానికి మూలకారణమైన విషయాన్ని గూర్చి చెప్పుకుందాము(12). కాకాసాహెబ్ గురించిన ఎన్నో విషయాలు చిన్నా పెద్దా సాయి భక్తులందరికీ తెలుసు! కానీ అతడు ప్రధమంగా శిరిడీకి ఎలా వచ్చారోనన్న విషయం చాలా మందికి తెలియదు(13). పూర్వపుణ్యం వలన భగవంతుని అనుగ్రహం వలన, సద్గురుని దర్శనం లభించి ఆనందం ప్రాప్తిస్తుంది(14). ఈ విషయానికి సంబంధించిన ముగ్గురు సాయి భక్తుల విషయాలను ఈ అధ్యాయంలో వివరించబోతున్నాను. ఈ విషయాలను విన్న శ్రోతలు ఎంతో ఆనందం పొందుతారు(15). పరమార్ధం ప్రాప్తించడానికి ఎన్నెన్నో ఉపాయాలున్నప్పటికీ గురు కృపాదృష్టి లేకపోతే ఏవీ పరమార్ధాన్ని ప్రసాదించలేవు(16). ఇందుకు సంబంధించిన మధురమైన ఈ కథను వింటే శ్రోతలకు ఆధ్యాత్మిక జిజ్ఞాస కలుగుతుంది(17). పరమపావనమైన ఈ అధ్యాయాన్ని శ్రోతలు తమ శ్రేయస్సు కొరకు శ్రద్ధతో వినండి(18).

హరిసీతారాం దీక్షిత్‌ను సాయి భక్తులంతా ప్రేమగా 'కాకా సాహెబ్' అని పిలిచేవారు(19). అతనికి సం।। 1909 వరకూ సాయిబాబా గురించి ఏమీ తెలియదు. కానీ తర్వాత ఆయన గొప్ప సాయి భక్తుడుగా ప్రసిద్ధి చెందారు(20,21). విశ్వవిద్యాలయ

శిక్షణ పూర్తి అయిన తర్వాత చాలా సంవత్సరాలకు ఒకసారి నానా చందోర్కర్ 'లోనావాలా' వచ్చాడు(22). దీక్షిత్, నానా సాహెబ్ పాత మిత్రులు. చాలా సంవత్సరాల తర్వాత వారిరువురూ కలుసుకున్నారు. ఒకరి మంచి చెడ్డలు మరొకరు తెలుసుకున్నారు(23). దీక్షిత్ లండన్ నగరంలో వుండగా ఒకసారి రైలెక్కబోతూ కాలుజారి పడ్డాడు. కాలుకు బాగా దెబ్బ తగిలింది. ఎన్ని చికిత్సలు చేసినా ఫలితం కలుగలేదు(24). మాటల సందర్భంలో తన కాలునొప్పి ప్రసక్తి వచ్చింది. అప్పుడు నానా సాహెబ్‌కుసహజంగానే బాబా గుర్తుకు వచ్చారు. (25). అతడు దీక్షిత్‌తో యిలా అన్నాడు: "దీక్షిత్! నీకు నీ కాలి కుంటితనం పూర్తిగా పోవాలని వున్నదా? అలాగనుక వుంటే నీవు మా గురువు గారైన సాయిబాబా దర్శనానికి వస్తే నీ బాధ పూర్తిగా నయమవుతుంది"(26). ఇంకా అతడు సాయిబాబా గురించి, ఆయన అద్భుతమైన మహిమల గురించి దీక్షిత్‌కు వివరించాడు(27). 'నా వాడు ఎంత దూరాన వున్నా-సప్తసముద్రాలకవతల వున్నా సరే పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కుని వచ్చినట్లు లాగుకుని వస్తాను." అని బాబా ఎప్పుడూ చెబుతుంటారు. మనం బాబాకు చెందినవారమైతే బాబా వైపుకు ఆకర్షింపబడము(29). దీక్షిత్! నీవు అయనకు చెందినవాడవైతే ఆయన దర్శనం నీకు లభించదు. అనుకున్నంతమాత్రాన మనం ఆయన చెంతకు ఎప్పటికీ వెళ్ళలేము. ఆయన సంకల్పం వుంటేనే అక్కడకు వెళ్ళడం సంభవిస్తుంది"(30).

శ్రీ సాయిబాబా గురించి నానా చెప్పగా విన్న కాకాదీక్షిత్ మనస్సుకు ఎంతో శాంతి లభించింది. అతడు నానాతో "నేను శ్రీ సాయిబాబా దర్శనం తప్పక చేసుకుంటాను. నా కాలు నొప్పి సంగతేమున్నది? ఈ శరీరమే నశ్వరమైనది? ఈ కాలు బాధ ఎంత కాలమైనా వుండనీ, దాని గురించి నాకు బాధలేదు(31,32). అత్యంత శ్రేయస్కరమైన మోక్షసుఖాన్ని పొందడానికి నేను తప్పక మీ గురువుగారి దర్శనానికి వెళ్తాను. ఈ అల్పమైన సుఖాలపట్ల నాకు ఆసక్తిలేదు. నేను వాటికోసం ఆయనను అర్థించను" అన్నాడు(33). అతనింకా యిలా అన్నాడు: "పరబ్రహ్మతత్త్వ ప్రాప్తి కంటే అమూల్యమైన సుఖం వేరే ఏమీ లేదు. నేను దాని కోసం బాబాకు దాసుణ్ణి అవుతాను. ఆయన దర్శనం చేసుకుంటాను(34). నా కాలు కుంటితనం గురించి నాకెట్టి చింతాలేదు. నా మనస్సు యొక్క కుంటితనాన్ని పోగొట్టమని సాయిబాబాను ప్రార్థిస్తాను(35). ఎన్నో సాధనలు చేసి చేసి నేను చాలా అలసిపోయాను. కానీ ఎంతకూ నా మనస్సు నిశ్చలం కావడం లేదు(36). నా మనస్సును అదుపులో పెట్టాలని ఎంతగా ప్రయత్నించినా నాకు తెలియకుండానే నా మనస్సు అధీనం తప్పుతూంది. ఇది ఎంతో ఆశ్చర్యకరమైన విషయం(37). నానా! మళ్ళీ చెబుతున్నాను- మీ గురువుగారైన శ్రీ సాయిబాబాను దర్శించుకుని నా మనస్సు యొక్క వైకల్యాన్ని తొలగించమని ఆయనను హృదయపూర్వకంగా ప్రార్థిస్తాను"(38). "నశ్వరమైన శరీర సౌఖ్యాలపట్ల విరక్తుడై పారమార్థికతయందు ఆసక్తిగలవారంటే సాయిబాబాకు ఎంతో ప్రీతి"(39).

అప్పుడు శాసనసభా ఎన్నికలు జరగబోతున్నాయి. ప్రజలు ఆ విషయాలనే చర్చించుకుంటూ వున్నారు. కొంతమంది ఆయా కార్యక్రమాలయందే నిమగ్నులయ్యారు(40). దీక్షిత్ గూడ తన ఎన్నికల ప్రచారం కోసం అహ్మద్‌నగర్‌లోని తన స్నేహితుల వద్దకు వెళ్ళాడు(41). కాకా సాహెబ్ మిరికర్ అక్కడ సర్దారుగా వున్నాడు. అతడు ఎంతో సన్నిహితుడవడంవల్ల దీక్షిత్ అతని యింట్లో బస చేసాడు(42). ఆ సమయంలో అహ్మద్‌నగర్‌లో అశ్వప్రదర్శన వుండడం వల్ల చాలా మంది జనం అక్కడకు చేరారు(43). బాలా సాహెబ్ మిరికర్ అనునతడు కోపర్గావ్‌లో మమల్తదారుగా వున్నాడు. అతడు గూడా గుర్రాల ప్రదర్శన చూడడానికి అహ్మద్‌నగర్‌కు వచ్చాడు(44). దీక్షిత్‌కు అక్కడకు వచ్చినపని అయిపోయింది. ఇక అతనికి శిరిడీ వెళ్ళాలని ఎంతో ఆతృతగా వున్నది. కానీ శిరిడీ ఎలా వెళ్ళాలి? తనకు తోడుగా అక్కడకు ఎవరు వస్తారు? అని ఆలోచించసాగాడు. ఆవిషయాన్నే కాకా సాహెబ్ మిరికర్‌కు తెలియజేసాడు దీక్షిత్(46,47). కాకా సాహెబ్ మిరికరు, అతని కుమారుడు బాబా సాహెబ్ మిరికరు-తమ ఇద్దరిలో దీక్షిత్ వెంట ఎవరు వెళ్ళాలి అని ఆలోచిస్తున్నారు. కానీ మానవుని యొక్క సంకల్పం ఒక విధంగా వుంటే భగవంతుని సంకల్పం మరోవిధంగా వుంటుంది. దీక్షిత్ యొక్క శిరిడీ ప్రయాణానికి ఆశ్చర్యంగా అనుకోని సంఘటన ఒకటి సంభవించింది(48-51).

- సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



ఆగస్టు సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



స్వామి కోపంతో గాడిద మాంసాన్ని, రక్తాన్ని, విష్ణుదత్తుని ఒంటి నిండా పూశారు. అయినా అతడు స్వామి పాదాలను విడువలేదు. ఓరీ మూర్ఖుడా! ఇక్కడ నుండీ వెంటనే వెళ్లిపో. లేకుంటే యిప్పుడే నీ ప్రాణాలు తీస్తా. పో వెళ్లిపో అని స్వామి కేకలు వేయసాగారు. విష్ణుదత్తునికి పట్టరాని దు:ఖం వచ్చింది. అతడు బోరున ఏడుస్తూ దేవా! ఏమిటీ పరీక్ష? నా సామర్థ్యం మీరెరుగరా? అల్పుడను, అజ్ఞానిని అయిన నేను మీ పరీక్షలకు నిలువలేనని మీకు తెలియదా? దయామయులైన మీరు నన్ను ఆదరించలేరా? దీనజనరక్షకా! నా పై ఏమిటీ కినుక? కరుణా సముద్రా! ఈ దీనుణ్ని కరుణించండి. అనుగ్రహించండి. అంటూ వేడుకొనసాగాడు. దత్తాత్రేయ స్వామి ప్రసన్నుడై, సౌమ్యమైన కంఠ స్వరంతో విష్ణుదత్తా! లే. లే. దు:ఖించకు అంటూ అతడిని రెండు చేతులతో లేవనెత్తారు.

విష్ణుదత్తుడు దిగ్భ్రాంతుడైనాడు. చుట్టూ పరిసరాలన్నీ కొత్తగా కన్పిస్తున్నాయి. అది మాల పల్లె కాదు. అక్కడ చచ్చిన గాడిద లేదు. కాకులు, కుక్కలు, నక్కలు ఏవీ లేవు. రక్తమాంసములు ఏవీ లేవు. చుట్టూ సువాసనలు వెదజల్లే అందమైన పూలచెట్లు, ఫలవృక్షాలతో ఆ ప్రదేశం నందనవనంలాగా వుంది. సుగంధభరితమైన చల్లని గాలి వీస్తున్నది. స్వామి ఒక చలువరాతి ఫలకం మీద కూర్చుని వున్నారు. పీతాంబరధారియై, మెడలో రుద్రాక్షలతో, దండ కమండలాలతో, జటాధరుడై, యజ్ఞోపవీతముతో, విభూతి నామాలతో, కుంకుమధరించి, చేతిలో జప మాలతో, స్వామి ఎంతో శుచిగా, పవిత్రముగా ప్రశాంతముగా వున్నారు. విష్ణుదత్తుడు, చకితుడైనాడు. ఏమిటీ వింత? ఏమి యీ స్వామి మహత్యం? అని అనుకొంటూ వుండగ స్వామి చిరునవ్వుతో, యిలా అన్నారు.

“విష్ణుదత్తా! మూడుసార్లు తిరిగావు. నాతో నీకేమిపని?” విష్ణుదత్తుడు ఆ కరుణారసభరితమైన స్వరం విని కరిగిపోయాడు. సంతోషం ఉప్పొంగుతుంటే ఆనందాశ్రువులు కారుతుండగా స్వామి పాదాలపై పడి సాష్టాంగమాచరించి, లేచి చేతులు జోడించి. “దేవదేవా! ఇప్పటికి కరుణించావా! ధన్యుడను స్వామి, ధన్యుడను. నా జన్మ చరితార్థమైంది. నా పితృదేవతలు ధన్యులు. ఓ దత్తాత్రేయ స్వామి! నీ పాదారవిందములు దర్శించిన వారు ధన్యులు కాకుండ ఎలా వుంటారు? ఏమి కావాలని అడుగుతున్నారా స్వామి! ఇంతకన్నా నాకేమి కావాలి? నీ దర్శన భాగ్యాన్ని పొందగలిగిన నా అదృష్టమెంత గొప్పది!” అంటూ స్వామిని స్తుతించాడు విష్ణుదత్తుడు. స్వామి “ఓ బ్రహ్మణోత్తమా! నీ పట్ల ప్రసన్నుడనైనాను. నీకు వరమీయదలచాను. ఏమికావాలో కోరుకో.” అన్నారు. “స్వామీ! కృతార్థుడను. నా యింట్లో యీనాడు పితృ శ్రాద్ధము జరగవలసివున్నది. ఆ శ్రాద్ధమునకు మీరు రావలసినదిగా ప్రార్థిస్తూవున్నాను.” అన్నాడు విష్ణుదత్త సోమయాజి. స్వామి సంతోషంగా “నీ కోరిక తప్పక నెరవేరుస్తాను. నీవు యింటికి వెళ్లు. నేను యిప్పుడే స్నానంచేసి, శుచియై మీ యింటికొస్తాను.” అనగానే పట్టరాని సంతోషంతో స్వామికి నమస్కరించి, శలవు తీసుకొని పరుగు పరుగున యిల్లు చేరాడు విష్ణుదత్తుడు. “సుశీలా! త్వరగా రా. మన భాగ్యమే భాగ్యం. స్వామి మనలను అనుగ్రహించారు.” అంటూ లోపలవున్న భార్యను వాకిలి

నుండే గట్టిగా పిలుస్తూ యింట్లోకి ప్రవేశించాడు. ఆ కేకలు విని వచ్చిన సుశీల ముఖమంతా సంతోషం తాండవిస్తున్న భర్తను చూచి అతనినుండి జరిగినదంతా విని ఆనందించింది.

స్వామి తమ యింటికి విచ్చేస్తున్నారని తెలిసి పరవశించి పోయింది. ఎంతో భక్తి శ్రద్ధలతో శ్రాద్ధమునకు కావలసిన వంటాకాలను సిద్ధం చేసింది. ఇంతలో శ్రీ దత్తాత్రేయ స్వామి రానే వచ్చారు. ఆ దంపతులు స్వామిని లోనికి ఆహ్వానించి, అర్ఘ్యపాద్యములిచ్చి, ఉచిత ఆసనముపై కూర్చుండ జేశారు. స్వామి చుట్టూ పరికించి చూశారు. "విష్ణుదత్తా! నీ యింట నేడు పితృశ్రాద్ధమని చెప్పావు మరి. నేను కాక, శ్రాద్ధకార్యమును నిర్వర్తించే మరి యిద్దరు ఎక్కడ? వారేరి?" అని ప్రశ్నించారు. విష్ణుదత్తుడు జరిగిన పొరపాటుకు తడబడ్డాడు. స్వామి వస్తున్నారన్న సంతోషంలో మరి యిద్దరు బ్రాహ్మణులను పిలవటం మర్చిపోయాడు. స్వామికి ఏమి జవాబివ్వాలో తోచక నోటమాటరాక, చేతులు నలుపుకొంటూ, గుడ్లు మిటకరించి చూస్తూ నిలబడిపోయాడు. పరిస్థితిని గమనించిన సుశీల కలుగజేసుకొని, స్వామికి నమస్కరించి " స్వామి! వారు కూడా యిదిగో! యిప్పుడే వచ్చేస్తున్నారు." అని పలికి, వాకిలి బయటకు వచ్చి నిలబడి ఆలోచించ సాగింది. 'ఇప్పుడేమి చేయాలి? లోపల స్వామి వేచి వున్నారు. ఓ పరమాత్మా! నీవే దారి చూపించు' అంటూ మనసులో మెఱుపులా ఒక ఆలోచన మెరిసింది. గబగబా యింటి ముందు ప్రాంగణంలోకి వచ్చి ఆకాశంవైపు చూసింది. అత్యంత దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న సూర్య బింబాన్ని చూసింది. రెండు చేతులూ జోడించి నమస్కరించి సూర్య భగవానుని యిలా ప్రార్థించింది.

నమస్సవిత్రే జగదేక బంధవే
సర్వాత్మనే సర్వధియాంచ సాక్షిణే
అచేతనం దేవ మిదం స చేతనం
విధాసి విశ్వం స్వకరైః రవి ప్రభో.

ఓ సవితా! జగదేకబంధూ! నీకు నమస్కారము. సర్వాత్మకా! సర్వధీసాక్షీ! రవీ! ప్రభూ! ఈ అచేతనమైన విశ్వాన్ని నీ కరములు ప్రసరింపజేసి సచేతనముగా చేస్తున్నావు. ఓ సూర్యభగవానుడా! నీవు మాయ చేత వివిధములైన వికారభూతజాలమును సృష్టించి, అంతరాత్మవై నిలిచి సకల విశ్వాన్ని చూస్తూవున్నావు. అటువంటి నీకు నేను చెప్పవలసినదేమున్నది? ప్రస్తుత నా పరిస్థితిని గమనించి నన్ను కాపాడవలసినదిగా ప్రార్థిస్తున్నాను."

పతివ్రతా శిరోమణి అయిన సుశీల ప్రార్థనను విన్న సూర్యభగవానుడు సాకారుడై దిగివచ్చి "తల్లీ! నన్ను ఏమి చేయమంటావు? నీ సమస్య ఏమిటి?" అంటూ ఎంతో సౌమ్యంగా అడిగాడు.అప్పుడు సుశీల నమస్కరించి "స్వామీ! సూర్యదేవా! మీకు తెలియనిదేమున్నది? స్వార్షములో మీరు ద్వితీయులుగా వుండమని ప్రార్థిస్తున్నాను." అన్నది. సూర్య భగవానుడు అందుకు అంగీకరించి, కాళ్లు కడుగుకొని, లోపలికి వచ్చి, తన స్థానములో ఆశీనుడైనారు.

దత్తస్వామి "బ్రాహ్మణోత్తమా! ఇద్దరము వున్నాము. మూడవ వారు కనుపించటంలేదు. శ్రాద్ధము దేవహీనము కాకూడదుకదా!" అన్నారు. విష్ణుదత్తుడు కంగారు పడ్డాడు. 'భార్య సుశీల పుణ్యమా అని రెండవ వారుగా సూర్యదేవులు విచ్చేశారు. బాగానేవుంది. మరి మూడవవారినెక్కడనుండి తీసుకురావాలి? ఇప్పుడేది దారి? ' అనుకొంటూ దిక్కు తోచని స్థితిలో కాళ్లు, చేతులు చల్లబడి, నేలపై చతికిలబడి పోయాడు. భర్త అసహాయతను గుర్తించిన సుశీల యింటి లోపలికి వెళ్లి నిత్యాగ్నిహోత్రము నిర్వహించే హోమ గుండము ఎదుట నిలచి నమస్కరించింది. "గృహేశ్వరా! అగ్నిదేవా! లే నాయనా! మరొక దేహాన్ని ధరించి వచ్చి శ్రాద్ధకార్యము నిర్వర్తించి భుజింతువుగాని, త్వరగా విచ్చేయి తండ్రీ! భగవంతుడైన శ్రీ దత్తాత్రేయస్వామి సమాశీనులై వున్నారు. తనతో సమానుడవు నీవే అని భావించిన ఆ స్వామి నీ రాకకోసం ఎదురుచూస్తూ వున్నారు. మూడవ వానిగా నిన్ను తలచి నీకైవేచి వున్నారు.

నమస్తే సరవర్యాయ వైశ్వానర హవిర్భుజ
త్వం ముఖం సర్వదేవానాం ధూమకేతో అనుగ్రహాణమాం.

అగ్నిదేవా! నీవు దేవతలలో అగ్రగణ్యుడవు. దేవతలందరకు హవిస్సులు నీ ముఖమునుండే చేరుతున్నాయి. ఓ ధూమకేతూ! ఓ విశ్వానరా! నన్ను అనుగ్రహించు. నీవే గృహపతివి. సకల కర్మకాండలకు అధిపతివి. నీకు నమస్కరిస్తున్నాను. ఎక్కడా కర్మకాండలో ఏలోపము రాకుండా కాపాడుతండ్రీ! అంటూ సుశీల ప్రార్థించగానే సాకారుడై అగ్నిగుండమునుండీ అగ్నిహోత్రుడు వెలుపలికి వచ్చి, కాళ్లు కడుగుకొని తన స్థానములో కూర్చున్నాడు.

అంతా గమనిస్తున్న దత్తాత్రేయస్వామి సుశీల మహత్మ్యాన్ని చూచి ఆశ్చర్యము, ఆనందము పొందారు.

అందరూ ఎవరి స్థానాలలో వారు కూర్చుని శ్రాద్ధకర్మ ప్రారంభించారు.

పితృస్థానంలో సాక్షాత్ భగవానుడైన శ్రీ దత్తాత్రేయస్వామి ।

విశ్వేదేవస్థానములో సూర్యభగవానుడు।

దేవస్థానములో అగ్నిదేవుడు।

ఏమీ ఆ శ్రాద్ధము! ఇది ఎంత అద్భుతము! విష్ణుదత్తుని భాగ్యమే భాగ్యము. ఇంతటి భాగ్యానికి నోచుకొన్న అతని పూర్వపుణ్యమెంత గొప్పదో కదా! అతని పితృదేవతలు ఎంత ధన్యులో!

ముగ్గురుదేవతలు యథావిధిగా శ్రాద్ధకర్మ పూర్తిచేసి భుజించి "తృప్తాస్మః" అని ఆచమించి విష్ణుదత్తుని పితృదేవతలకు అక్షయ పుణ్యలోకాలను అనుగ్రహించారు. శ్రాద్ధకర్మ ముగిసింది.

**- సశేషం**

---

జై సాయి మాస్టర్ !!

జీవితానికి సరియైన అర్థాన్నిచ్చే అన్వేషణ, సాయి మాస్టర్ భక్తి జ్ఞాన విషయాలతో, యీనాటి సామాజిక సమస్యలకు సమాధానాల చర్చలతో ప్రతి యింటా నిత్య సత్సంగమే మన శ్రీ సాయిమాస్టర్ ఫోరమ్స్.

**www.saimasterforums.org**

చదవండి! **శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి** చదివించండి!!

సంస్కృత మూలము : శ్రీ వాసుదేవానంద సరస్వతి

తెలుగు : ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

వెల : రూ॥ 80-00 లు

ప్రతులు:- **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్**,

c/o, **Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,

Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**

# వార్తాలాపము

ఆగస్టు సంచిక తరువాయి (సీరియల్)

## తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము-ఈమూడును ఒకే సమయమున సిద్ధించును

"వాసనాక్షయము కానంతవారకు తత్త్వజ్ఞానము కలుగదు. తత్త్వజ్ఞానము కలుగనంతవరకు మనోనాశము కూడా అవదు. వాసనాక్షయము, తత్త్వజ్ఞానము, మనోనాశము-ఈమూడును కార్యకారణ సంబంధము కలవి. కావున ఈమూడింటిని ఒకేమారు అభ్యసించవలెను." అని వశిష్ఠులు చెప్పిరి.

వాసనాక్షయవిజ్ఞానమనోనాశా మహామతే।
సమకాలం చిరాభ్యస్తా భవన్తి ఫలదాయన:॥

"ఓ మాహాబుద్ధిమంతుడగు రామా! వాసనాక్షయము, తత్త్వజ్ఞానము, మనోనాశము-ఈ మూడింటిని చాలాకాలము ఒకేమారు అభ్యసించినచో జీవన్ముక్తావస్థ పొందబడును."

తస్మాద్రాఘవ యత్నేన పౌరుషేణ వివేకినా।
భోగేచ్ఛాం దూరతస్త్యక్త్వా త్రయమేతత్సమాచరేత్॥

"ఓ రాఘవ! పురుషార్థియగు వివేక, విషయభోగాదులందలి కోరికను దూరమునిండియే విడనాడి తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము అను మూడింటిని అభ్యసించవలెను."

తత్త్వజ్ఞానమునకు శ్రవణము, మననము మొదలగునవి సాధనములు. మనోనాశమునకు యోగమును (సమాధిని) అభ్యసించుట సాధనము. మలినవాసనావృత్తికి మైత్ర్యాదిప్రతికూలవాసనలను ఉద్భవింపజేయుట సాధనము.

వైద్యరాజు:- కొందరు విద్వాంసులు జ్ఞానులు రెండు రకములు అని చెప్పెదరు. 1. కృతోపాస్తి, 2. అకృతోపాస్తి. కృతోపాస్తికి తత్త్వజ్ఞానముతోపాటు జీవన్ముక్తికూడ కలుగును. అకృతో పాస్తి జ్ఞానము కలిగినతరువాత జీవన్ముక్తికొరకు వాసనాక్షయమును, మనోనాశమును అభ్యసించవలెను.

స్వా. ప్ర. :- ప్రతి అంత:కరణమునందును మల, విక్షేప, ఆవరణములనెడు మూడు దోషములు ఉండును. అనేకజన్మలయందు బ్రహ్మహత్యాది పంచమహాపాపములను, గోహత్యాది పాపములను చేయుటవలన కలుగు మలినసంస్కారములు మలదోషము. విక్షేపదోషమనగా ఐదు రకములగు విషయాదుల భోగవాసనలు. ఆవరణదోషము అనగా జీవబ్రహ్మములమధ్యనుండు అజ్ఞానమను తెర. ఈ మూడు దోషములను నివృత్తినొందించుటకు వేదశాస్త్రములయందు క్రమముగా కర్మ, ఉపాసన, జ్ఞానము ప్రతిపాదించబడినవి.

ఉపాసనచేసి విక్షేపదోషమును పోగొట్టుకొనకుండ తత్త్వజ్ఞానము కలుగునని ఎవరైన అనుకొనినచో అది సర్వదా అసంభవము. భోగవాసన రాగవిశేషము. ఉపాసన లేనిదే భోగవాసన నివృత్తిని పొందదు.

భోగవాసన నివృత్తిని పొందనిదే రాగాదిదోషములుకల అంత:కరణమునందు జ్ఞానము ఎప్పుడును కలుగదు. "రజోరాగాదికం విద్ధి" అని భగవానుడు గీతలోకూడ చెప్పెను. "రాగాది మలినవాసనలు రజోగుణకార్యములు. వాసన రెండు రకములు. శుద్ధము, మలినము అని. శుద్ధవాసన దైవసంపద. మలినవాసన అసురసంపద. అసురసంపదను పోగొట్టుకొనుటకు దైవసంపదను సంపాదించవలెను. దైవసంపద అన్నివిధములుగాను లభించినపిమ్మట శ్రవణ, మనన, నిధిధ్యాసనములద్వారా జ్ఞానము కలుగును.

రాగాది అసురగుణములు రజోగుణకార్యములు. వైరాగ్యాదులు మిశ్రసత్త్వముయొక్క కార్యములు. తత్త్వజ్ఞానము శుద్ధ సత్త్వముయొక్క కార్యము. "సత్త్వాత్ సంజాయతే జ్ఞానం" అని భగవానుడు గీతయందు చెప్పెను.

మిశ్రసత్త్వగుణమునకు చెందిన దైవసంపదయందు రజోగుణము ఉండదు. ఆ దైవసంపదచే శుద్ధసత్త్వగుణముకల జ్ఞానియందు మరల రాగము జనించును అను అభిప్రాయము తప్పు. కొందరు విద్వాంసులు అంత:కరణమునుండి భోగవాసనను

నివృత్తిని పొందించ లేక, కేవలము శాస్త్రాభ్యాసము మాత్రమే చేసినందున "మేము తత్త్వజ్ఞానులము, మాకు విదేహముక్తియందు ఎట్టిబాధయు ఉండదు, జీవన్ముక్తి ఆనందమునకు భాధాకరము" అని చెప్పి జీవన్ముక్తికిని, తత్త్వజ్ఞానమునకును భేదమును ప్రతిపాదించెదరు. వారు భోగవిలాసములు యందు నిమగ్నులగుదురు. తాము కృతకృత్యుల మనుకొనెదరు.

వైద్యరాజు:- జీవన్ముక్తియందు విద్యారణ్యులు చెప్పిరి.

రాగాదయ:సన్తు కామం న తద్భావోపరాధ్యతి।
ఉత్ఖాతదంశోరగపదవిద్యా కిం కరిష్యతి॥

"జ్ఞానికి రాగాదులు కలుగవు. కలిగినను వానివలన ఏమియు బాధ కలుగదు. విషపుకోరలు తీసివేసిన సర్పము ఏమియు బాధించలేనట్లుగనే జ్ఞానికి రాగాది అవిద్యాకార్యములు ఏమియు చేయలేవు."

స్వా. ప్ర. :- జీవబ్రహ్మములమధ్యనున్న అజ్ఞానము తత్త్వజ్ఞానముచే నివృత్తిని పొందినపిమ్మట అజ్ఞానము, అజ్ఞాన కార్యములును అగు రాగాది మలినవాసనలకు అస్తిత్వము కలదనుట సరియేనా?

వైద్యరాజు:- తత్త్వజ్ఞానము కలిగిన తరువాత రాగాదులగు మలినవాసనలు ఉండవు. కాని విద్యారణ్యస్వామివంటి మహావిద్వాంసులు అసత్యము వ్రాయుదురా?

స్వా.ప్ర. :- (నవ్వుచు) బికనీరులో ఒక మార్వాడీ ఉండెను. అతడు 12, 13 సంవత్సరములు బాలికను పెండ్లాడెను. అనంతరము తన వ్యాపారమునకు పరదేశమునకు వెళ్ళిపోయెను. మూడు, నాలుగు సంవత్సరములతరువాత మామగారు అతనికి ఉత్తరము వ్రాసెను. "మా అమ్మాయి పెద్దమనిషి అయినది. నీవు వచ్చి తీసి కొని వెళ్ళుము." ఆరుమాసములు తరువాత వచ్చెదనని మార్వాడీ సమాధానము వ్రాశెను. కానీ ఆరు మాసములతరువాత అతడు వెళ్ళలేదు. అంతట మామగారు అతడికి తరుచు ఉత్తరములు వ్రాయుచుండెను. కాని అతడు నాలుగు మాసములలో వచ్చెదను, ఐదుమాసములలో వచ్చెదను. అని సమాధానముకు వ్రాశెను కాని వెళ్ళలేదు. ఇట్లు పెండ్లి అయినతరువాత 12, 13 సంవత్సరములు గడిచిపోయెను. అప్పటికి ఆ మార్వాడీ బొంబాయివచ్చి, అచ్చటి మార్వాడి బజారులో మకాము చేసియుండెను. మార్వాడి మామగారు చాలా విసుగెత్తియుండెను. కావున అతడు తన అల్లుని స్నేహితునితో, "నేను ఉత్తరములు వ్రాసి వ్రాసి విసిగితిని. నీవే వ్రాయుము" అని చెప్పెను. ఆ ఇరువురును కూర్చొని ఉత్తరము వ్రాసిరి. వ్రాయుచుండగా అతనికి కోపము వచ్చి ఇట్లు వ్రాయమనెను. "ఇంకా ఎక్కువ ఏమి వ్రాయుదును. నీ భార్య విధవ అయిపోయినది. ఇపుడైన రమ్ము." మిత్రుడు వ్రాయుటకు జంకెను. అంతట మామగారు ఇట్లనెను. "నీకేమి భయము లేదు. నేను ఉన్నాను. వ్రాయుము." ఆ విధముగా బొంబాయికి ఉత్తరము వ్రాయగా అందెను.

నలుగురులోను ఆ ఉత్తరము చదివి మార్వాడీ మొత్తుకొని ఏడ్వసాగెను. నాలుగువైపులనుండి జనులు ప్రోగుపడి ఎవరు చని పోయారి? అని ప్రశ్నించిరి. మార్వాడీ ఏడ్చుచు "నా భార్య విధవ అయిపోయినది" అని పలికెను. అందరు పకపక నవ్విరి.

మార్వాడీ పలికెను. నేనేమైనా అబద్ధము చెప్పుచున్నానా? ఉత్తరము చదివి చూడండి. జనులు ఉత్తరము చదివిరి. అనంతరము వారు ఇట్లనిరి. ఉత్తరమునందు వ్రాయబడియున్నను, నీవు ఇక్కడ కూర్చొనియుండగా నీ భార్య విధవ అగుట ఎట్లు? ఆ మాత్రం ఆలోచించవేమి?

మారువాడీ:- అది నేనుకూడ ఎరుగుదును. కాని స్నేహితుడు ఇట్లు ఎందుకు వ్రాయును? అసత్యము వ్రాయడుకదా! అని అడిగెను. మీరుకూడ ఆ మార్వాడీవలే యుక్తిరహితంగా మాట్లాడుచున్నారు.

ఇది విని శ్రీ నిత్యానందస్వామివారు మొదలగువారందరును నవ్వసాగిరి.

యోగవాసిష్ఠము చెప్పుచున్నది.

యుక్తియుక్తముపాదేయం వచనం బాలకాదపి।

అన్యత్ తృణమివ త్యాజ్యమవ్యుక్తం పద్మయోనినా॥

"ఆధారముకల వాక్యము బాలకుడు చెప్పినను గ్రహించవలెను. నిరాధారమగునది బ్రహ్మ చెప్పినను గడ్డిపోచతో సమానముగా చూచి త్యజించవలెను."

ఇదంతయును నేను వినోదార్థము చెప్పితిని. జీవన్ముక్తికి సంబంధించిన ఆ శ్లోకమునందలి రాగశబ్దమునకు భావము రాగము కాదు, రాగభాసము మాత్రమే.

దప్పిక గొన్నవాడు ఎండమావులను చూచి నీరని భ్రమపడి దాహము తీర్చుకొనుటకు వానివైపు పరుగిడును. కాని అతనికి అచ్చుట నీరుకన్పించక ఎండమావులే కన్పించును. అంతట వానికి ఎక్కడ క్షారభూమి ఉన్నను అది ఎండమావులే అయి ఉండును. నీరు అనుకొనుట అజ్ఞానము అని తోచును. అటులనే జ్ఞానముద్వారా విషయాదులయందు మిథ్యాత్వబుద్ధి కలిగినంతనే పదార్థములయందు రాగాది మలినవాసనలు కలుగుటకు అవకాశము పోవును. కావున పైశ్లోకమునందలి రాగశబ్దమునకు తాత్పర్యము రాగభాసము మాత్రమే. జ్ఞానికి ఉండు అన్న పానాదులను పొందవలెనను కోరిక రాగాభాసము అనబడును.

వైద్యరాజు:- తత్త్వజ్ఞానము కలిగిన పిమ్మట భోగవాసన ఉండదు. అది బాగుగనే ఉన్నది. కాని సమాధినుండి ఉత్థానమును పొందినపిమ్మట జ్ఞానియొక్క వృత్తి బహిర్ముఖమగును. కర్తృత్వ, భోక్తృత్వాది అంత:కరణధర్మమును క్లేశమును కలుగ జేయును. అతడు దుఖ:నివృత్తిని పొందుటకును, మరల జీవన్ముక్తియొక్క-ఆనందమును పొందుటకును సమాధిని అభ్యసింపవలెనా?

స్వా. ప్ర.:- ఒకమారు సమాధిద్వారా అవిద్య, అవిద్యాజన్యములగు దు:ఖములు నశించి బ్రహ్మసుఖము పొందిన తరువాత మరల దు:ఖనివృత్తికొరకు సమాధిని అభ్యసించుట అసంభవము.

- సశేషం

# Donations List

**Annadhanam:-**

| | | |
|---|---|---|
| 1. M.G. Prasad | Visakha | 1343.00 |
| 2. Y. Ananta Viswanath | Visakha | 1343.00 |
| 3. B.Radhe Syam | Ongole | 1516.00 |
| 4. A.Paparao | Baptla | 1343.00 |
| 5. M.Sai Vara Prasad | Visakha | 2300.00 |
| 6. G. Narayana | Madanapalli | 1343.00 |
| 7. T.Ramachandra Reddy | Hyderabad | 1940.00 |
| 8. P.V. Sowbhagyalaxmi | Hyderabad | 1343.00 |

**General Donation:-**

| | | |
|---|---|---|
| 1. Smt. A.Suvarchala | Hyderabad | 1400.00 |
| 2. G.R. Viswanath Garu | Hyderabad | 9500.00 |

**School:-**

| | | |
|---|---|---|
| 1. K. Udaya Bhaskar Rao | Hyderabad | 1200.00 |
| 2. G. Brahmaiah Garu | Chirala | 500.00 |

# గణపతి పూజలోని రహస్యం

వినాయక చవితి ప్రత్యేక వ్యాసం ఆచార్య శ్రీ భరద్వాజ

భాద్రపద శుద్ధచవితి (ఈ సంవత్సరము తే:11/09/2010) నాడు మన దేశ మందంతటా హిందువులందరూ వినాయక చవితి పండుగను ఎంతో వేడుకగా చేసుకుంటారు. పిల్లల దగ్గర నుండి పెద్దల వరకు అందరూ దీనిలో పాల్గొంటారు. నాడు వినాయకుడిని పూజించుకుంటే ఆ సంవత్సరం పొడుగునా ఎలాటి విఘ్నాలు కష్టాలూ తమకు వాటిల్లవని నమ్ముతారు. అయితే యితరమతస్థులూ, ఇతర దేశాల వారు హిందువులు ఇటువంటి వికృత రూపాన్ని ఎలా భక్తితో ఆరాధిస్తారా అని ఆశ్చర్యపడతారు; అపహాస్యంగా తలుస్తారు. హిందువులలో చాలామందికికూడా మన ప్రాచీన ఋషులు ఈ దేవుని ఇలా ఎందుకు చిత్రించారన్నది అర్థంకాదు.

పూజ భక్తిలేనిదే సార్థకంకాదు. భక్తి అంటే అనన్యమైన ప్రేమ. అయినపుడు భగవంతునికి వినాయకునికి వర్ణింపబడిన రూపం ఎందుకాపాదించబడిందో, ఎందుకలా దర్శించబడిందో సంపూర్ణంగా అర్థమైతేగాని అలాటి భక్తికలుగదు. వాస్తవానికి తాత్వికమైన దృష్టితో చూచినట్లయితే భగవంతునికి మన ఋషులు ఆపాదించిన రూపాలు, పేర్లు పురాణాలనుగూర్చి లోతుగా ఆలోచిస్తే ఆవన్నీ పొడుపుకథల వలె, బీజగణిత సమీకరణాల (algebraic equations) వలె సకల సృష్టికీ ఆధారమూ, కారణమూ అయిన చైతన్యశక్తియొక్క వివిధ లక్షణాలను మనదృష్టికి తెచ్చేవిగా వుంటాయి.

వీటిని గూర్చి యోచించి కొంతైనా అవగాహన చేసుకున్నప్పుడు ఆ విశ్వశక్తి యొక్క మహిమ మన హృదయాలలో సంభ్రమాశ్చర్యాలతో కూడిన భక్తి భావాన్ని ప్రేరేపిస్తుంది. సృష్టియొక్క మహాద్భుతమైన తత్వాన్ని గూర్చిన ఆశ్చర్యమే అటు మతానికీ, ఇటు అత్యుత్తమమైన విజ్ఞానశాస్త్రానికీ బీజమని ఐన్‌స్టీన్ వంటి భౌతికశాస్త్రవేత్తలుగూడ అంగీకరించారు.

గణపతిని గూర్చి కొంచెం యోచిద్దాం. నామరూపరహితమైన విశ్వశక్తికి చైతన్య ప్రధానమని మన ఋషులే కాక ఎందరో ఆధునిక విజ్ఞాన శాస్త్రజ్ఞులు కూడ సప్రమాణంగ గుర్తించారు అదే పరమాత్మ, అది తన సహజ గుణాన్ననుసరించి అనేక మవ్వాలని సంకల్పించి ఈ అనంత విశ్వంగా రూపొందింది. ఈసృష్టి లోని వస్తువులన్నీ అనేక గణాలు (Groups or Classes)గా ప్రకటమయింది. నక్షత్రాలు, నక్షత్రాలకోవలు దగ్గర నుండి గ్రహాలు, భూమి మీద వృక్షాలు, పక్షులు దగ్గరనుండి ఒక్కొక్క జీవిదేహంలోని వివిధ ధాతుకణాల సమూహాలు (గణాలు) గానూ, అంతకంటే సూక్ష్మమైన పరమాణువులు వాటిలోని సూక్ష్మతర అంశాల వరకు గణాలుగా ఏర్పడ్డాయి. ఒక్కొక్క విధమైన ప్రకృతి ధర్మాలకుకట్టుబడి క్రమబద్ధంగా పనిచేసే లాగా ఈ సర్వానికి ఆధారమైన మూల తత్త్వమే ఆదేశించింది. అదే గణపతి. ఆ మూలశక్తిని శాసించే 'నాయకుడు' మరొకడులేడు. అందుకే పరమాత్మ వినాయకుడు. ఇట్టి తత్వం భూమిపై జీవించే మానవునికి ప్రకృతి రూపంగా ఎల్లెడలా దర్శనమిస్తుంది. దాని యొక్క తత్వాన్ని ఆ రీతిన దర్శించిన ఋషులు ఆ సత్యాన్ని వినాయకుని విచిత్రరూపంగా వర్ణించారు. వినాయకుని తలగా చర్ణించబడే ఏనుగుతల ప్రకృతి యొక్క ప్రత్యక్షరూపమైన మహారణ్యంలోని జీవ సంపదకు సంకేతం. అతి సూక్ష్మమైన ఏనుగు చెవుల యొక్క శబ్ద గ్రహణశక్తి నాదబ్రహ్మమును అనుసంధానము చేయగల యోగుల సామర్థ్యాన్ని సూచిస్తుంది.

దాని యొక్క తొండమనబడు పొడవైన ముక్కు యోగుల ప్రాణాయామ పరాయణతను సూచిస్తుంది. ఏనుగు మహత్తరమైన బలానికీ, ప్రకృతిలోని బృహత్తర ప్రాణశక్తికంతటికీ సంకేతం. ఇట్టి శిరస్సును మానవ దేహంపైన ఉన్నట్లు వర్ణించటం వలన ప్రకృతికంతటికీ విలక్షణుడు, తత్వజ్ఞానియైన మానవజాతికి ప్రతీకగా చెప్పడమైనది. పై లక్షణాలను సంతరించుకున్న మానవోత్తములు జన్మతహా చపలము, సంకుచితము, క్షుద్రముఅయిన మనస్సును దమించి ఉంచుకోగలుగుతారని సూచించడానికి ఈ దేవునికి ఎలుకను వాహనంగా పెద్దలుకల్పించారు. ప్రకృతిలో భాగమైన అల్పప్రాణులన్నిటికీ గూడ యిది ప్రతీక. గణపతిని సర్వ విధములైన పత్రితో పూజించాలని నిర్దేశించడం వలన యావత్ ప్రకృతీ పరమాత్మయొక్క సంకల్పమైన సృష్టి పథకానికి, తత్స్వరూపమైన పురుషార్థ సాధనానికీ వృక్షసంపదంతా ఎంతో వెలువైనదనీ సూచించారు. అజ్ఞానయుతమైన బుద్ధి వికారాల వలన ఉద్భవించే మానవులయొక్క రాగ ద్వేషాది వికారాల వలన మానవులు పరమార్ధ సాధనలో విఘ్నాలకు, దు:ఖాలకు గురియవుతారని, అలాగాక ఇట్టి తాత్వికదృష్టిని వహించి వికారాలను నిగ్రహించుకోవడానికి సృష్టికి కారణమైన పరమాత్మ సంకల్పానికీ సంపూర్ణంగా శరణాగతి చేయడానికీ వినాయక పూజ సర్వులకూ విధించబడింది.

విష్ణువుకు శ్రీదేవి, భూదేవి భార్యలుగ ఇరుప్రక్కల వున్నట్లు గణపతికి కూడ సిద్ధి, బుద్ధి అనే ఇద్దరు భార్తలున్నట్లు పెద్దలువర్ణించారు. అయితే సామాన్యంగా ఆలయాలలో ఆ యిద్దరు భార్యలరూపాలు కనిపించవు. కారణం ఆ యిద్దరూ ఉత్తమయోగి యొక్క బుద్ధిశక్తికి, దాని సహాయంతో సాధించబడిన ఆత్మసిద్ధికీ సంకేతాలు. ఈ రెండూ పూర్ణయోగికి బాహ్యామైనవి కావు.

మానవుడు ఆత్మసాధనకు తీవ్రంగా ప్రేరేపింపబడాలంటే వివేకంతో తనలోని బలహీనతలను గుర్తించి తన ప్రస్తుత పరిస్థితులతో తీవ్రంగా అసంతృప్తుడవ్వాలి. దీనిని సూచించడానికే వినాయకునికి భక్తులు మొట్టికాయలు వేసుకుని గుంజీలు తీస్తారు.

ఇక కొందరాత్మవేత్తలు గణపతిని గూర్చి తాత్వికంగాచేసిన వివరణమిక్కడ ఉటంకిస్తాను. పరమయోగియైన జ్ఞానేశ్వర మహరాజ్ యిలా వర్ణించారు. (జ్ఞానేశ్వరీ భగవద్గీత, అధ్యా. 1.)

'ఆరు భిన్నభిన్న తత్వసాంప్రదాయములకు చెందిన షడ్దర్శనములు ఈ గణేశమూర్తియొక్క ఆరు చేతులు. ఆ చేతుల లోని గొడ్డలి తర్కశాస్త్రానికీ, అంకుశన్యాయశాస్త్రానికీ, మోదకం ఆనంద ప్రధాయకమైన వేదాంత శాస్త్రానికీ సంకేతాలు. ఒక చేతిలోని విరిగిన దంతం నిర్దుష్టమైన తాత్వికదృష్టిచేత ఖండించబడిన నాస్తిక దృక్పథం. సతర్కవాదమే వరదహస్తము. ధర్మప్రతిష్టయే అభయ హస్తము. సువిచార చిహ్నాము సుందదండము. మతభేదములను పరిహరించు వాదనాచిహ్నామే పూర్ణదంతము. పూర్వ ఉత్తర మీమాంసలు రెండు చెవులు. ద్వైతాద్వైతములు గండస్థలములు. వాటినుండి ప్రవహించు మదజలధారలు సద్బోధ. వాటిని సేవించే తుమ్మెదలు మహర్షులు. జ్ఞానమునుబోధించే ఉపనిషత్తులే వీరి పూల కిరీటములు. రెండు పాదములు అకారములు. ఉదరము ఉకారము. మస్తకముయొక్క మహామండలమే మకారము. ఇందువలననే నేను సద్గురుకృపచే అఖిల విశ్వమునకు మూల బీజమైన వానికి నమస్కరించుచున్నాను.'

సకలసృష్టికాధారమైన ఏకత్వమేగాక, అందులోని నానాత్వాన్నిగూడ తన స్థూల దేహం కల్గియున్న విఘ్నేశ్వరునికీ, అదే లీలను కల్గియున్న శ్రీ సాయి వంటి సకల దేవతా స్వరూపియైనసద్గురువుకూ భేదముండజాలదని యీ పరిశీలన యొక్క అంతరార్థం. అందుకే ఒక భక్తురాలికి ఆమె యొక్క యిష్ట దైవమైన వినాయకుడే తానని, ఆయనకర్పించిన నివేదనలన్నీ తనకే చెందుతూండడంచేత బాల్యంనుండి ఆమెను తాము కనిపెట్టి యున్నట్లు సాయి చెప్పిన వివరం – 'శ్రీ సాయి లీలామృతం'లో చూడవచ్చు. ఎందరెన్ని దేవతలనుకొలచినా ఆ పూజ తనకే చెందుతుందనీ, ఆయాదేవతల రుపంలో ఆయా భక్తులననుగ్రహించేది తానేననీ భగవద్గీతలో శ్రీ కృష్ణుడు చెప్పిన దానిని సాయి గూడ చెప్పడమే గాక నిరూపించారు. సద్గురుభక్తులు పండుగలప్పుడు ఆయాదేవతల రూపంలో తమ సద్గురువునే ఆరాధించడం గీతాబోధయొక్క సారాంశమని గుర్తించి, యీ సంవత్సరము వినాయక చవితి నాడు శ్రీ సాయినే గణేశుడుగా పూజిద్దాము.

---

జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు–పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఇకనుండి ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు. D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

**Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone :040-20063300

**పూజ్య శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులు యీ క్రింది చిరునామాలకు విరాళాలర్పించి తరించగలరు.**

**Magazine** మరియు **General Donations** ను **"Sri Manga Bharadwaja Trust"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Annadanam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Sai Master)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Ashramam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Peace Foundation)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల్వారా పంపగలరు

**Books order** ను **"Sri Manga Bharadwaja Trust (Publications)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు.

**శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులకు మనవి, ప్రస్తుతము గురుకులము నిలిపివేసినందున గురుకులముకై విరాళములు పంపరాదు. గురుకులమునకు పంపు విరాళములు యితర సేవా కార్యక్రమములకు వినియోగించబడును.**

# శ్రీ భరద్వాజ లేఖామృతము

శ్రీ భరద్వాజ లేఖామృతము



Om Sai

V.Nagar

7-11-76

Dear Chy. Sulochana

జాబు చేరినది. చాలా సంతోషం. కొద్ది రోజులలవాటు కాగానే భయము, తలనొప్పి తగ్గుతాయి. నీ సాటి వారికి The Supreme Master bookను పరిచయం చేయవీలుంటే, సందర్భం కుదిరితే చెయ్యి.

చి॥ సరోజ వచ్చింది. చెప్పాను. ప్రయత్నిస్తున్నది.

"మీరుండగా నాకు భయమేముంది?" అని వ్రాశావు. చాలా సంతోషం. ఆ విశ్వాసం మీదనే ఉండు. ఏ భయము ఉండదు.

ఇక్కడంతా క్షేమం. మూర్తి వాళ్ళ ఇంట్లో అందరూ క్షేమం. అక్కడ స్వామి temple ఎడమపక్క వీధిలో సగందూరం వెడితే కుడివైపుకు Dr. Damodaran అని వుంటారు. చాలా మంచివారు. ఆయన ప్రత్యేకంగా స్వామి దర్శనం చేయించగలరు. ఎవరైనా మహనీయులు (మద్రిమలై స్వామి మొ॥న వాళ్ళు) వస్తే నీకు తెలుపమని చెప్పు. తిరుమలలో 4 మాసాలుండి, సాధన చేసుకునే అదృష్టం, జన్మల పుణ్యం. దానిని నీ శాయశక్తులా సద్వినియోగపరుచుకో. బాబా ఆశీస్సులు నీకు సదా ఉండుగాక!

ఇట్లు

ఆశీస్సులతో

భరద్వాజ

# పాత్రశుద్ధి

సమిత్పాణి

పూజకు పాత్రశుద్ధి అవసరం అంటారు. పెద్దలు తాము ఉపయోగించే పాత్రలను చక్కగా శుభ్రంగా ఉంచుకుంటారు. ఇది ఎంతో ముఖ్యమైన విషయం భగవదర్చనకు సాధనకు మనకు ఉపకరించే పరికరాలపై శ్రద్ధ లేకుంటే ప్రమాదం. మనకు సాధనపట్ల ఎంత శ్రద్ధ ఉంటే, ఎంత సుముఖత ఉంటే వీటిపై అంత శ్రద్ధ కలగి ఉంటాము.

మనలో చాలామంది వృత్తి రీత్యా కొన్ని వస్తువులు కలిగి ఉంటాము. వాహనము, cell phone, pen, briefcase,files మొదలైనవి. వాటిపై మనకెంత శ్రద్ధ ఉంటుందో గమనించాలి. మనకు ఇష్టమైన వస్తువులనే కాక మనకు ఇష్టమైన వారి వస్తువులు సైతం మనకెంతో విలువైనవిగా కనిపిస్తాయి. వాటిని ఎంతో జాగ్రత్తగా ఉంచుకుంటాము.మన జ్ఞాపకాలు, తల్లితండ్రుల, బిడ్డల, స్నేహితుల ఫోటోలు కూడా జాగ్రత్తగా భద్రపరుస్తాము. ఇవేకాక మనలో కొద్దిమందిమి Cinema hero photos, లాటరీ టిక్కెట్లు, పేకముక్కలకు సైతం ఎంతో విలువనిచ్చి, వాటిని ఇంకెవరైనా ముట్టుకున్నా సహించలేక వారిని వారిస్తాము. అంటే మనచుట్టూ ఉన్న మనుషులకన్నా మనకు అవే ఎక్కువ మనకు ఆధ్యాత్మికంగా కాదుకదా, లౌకికంగాసైతం ఉపయోగపడని వస్తువులపైనే మనకు ఇంత ఇష్టం, శ్రద్ధ ఉంటే, మనను సదా కాపాడుతూ, ఇహపరాలను ప్రసాదిస్తూ, ఆధ్యాత్మిక పురోభివృద్ధి అనుగ్రహిస్తూ, జన్మపరంపరలను సైతం మారుస్తూ, పాపకర్మను నిర్మూలించటం ద్వారా మనలను కష్టాల నుండి రక్షిస్తూ, మనకు, ధర్మబోధ చేస్తూ ఉండే సాయినాధుని పటము మొదలైన వస్తువులపై మనకు ఎంతటి శ్రద్ధ ఉండాలి? ఆయన పూజకు, మనకు సహకరించే వస్తువులపై మనకు ఎంతటి ఇష్టముండాలి?

అంతేకాదు ఆయన పూజలో ఆయనకు మనం అర్ఘ్య పాద్యాదులు, ఆచమనము ఇస్తాము. అటువంటి గిన్నె శుభ్రంగా ఉంచుకోవటం మన కనీస ధర్మం కాదా? మురికి గ్లాసులోంచి బాబాకు మంచినీళ్ళిస్తామా?

పైగా ఆయనకు మనం నైవేద్యం, ఆచమనం ఆ గ్లాసులోంచి లేదా పంచ పాత్రలోంచి ఇస్తున్నామంటే ఆ పాత్ర నిజానికి ఆయన సేవలోనిది-అంటే-ఆయనది కాదా? ఆయన పాత్రలను అశ్రద్ధ చేయటం సమంజసమేనా? అలా అయితే పూజపట్ల మనకు శ్రద్ధ ఉన్నట్లా?

అందుకే పాత్రశుద్ధి అవసరం. బాహ్యంగా మనం చేసే పూజలో మనకు సహకరిస్తుంది కాబట్టి అట్టి పాత్ర పవిత్రం, పూజనీయం.

అంతే కాదు. పాత్రశుద్ధి అనేది మన పూజా ఫలానికి మూలం. పాత్రశుద్ధి ఎంతగా ఉంటే అంతగా మనకు ఫలితం వస్తుంది అన్నారు మన పెద్దలు.

“పాత్ర” అంటే గిన్నె మాత్రమే కాదు. భక్తికి మూలం. పూజలో తన్మయతకు ఆధారం.

భక్తి నవవిధములు. ఈ నవవిధ భక్తులు ఏమిటంటే భగవంతుణ్ణి తొమ్మిది రకాలుగా కొలవటం అన్నమాట. అంటే సేవకునికి యజమానిపై ఉండే భక్తి ఒక రకం, భార్యకు భర్త పై ఉండేది ఒక రకం. బిడ్డకు తల్లిపై ఉండేది ఒక రకం స్నేహితులకు మధ్య ఉండేది ఒక రకం ఇలా రకాలుగా భగవంతుని భావించి ఆయనను సేవించవచ్చు.

అంటే మనం బిడ్డలుగా, భగవంతుని తండ్రిగా తల్లిగా భావించినప్పుడు మనకు ఉండేది ఒక భక్తి. ఆయనను మన పరమస్నేహితునిగా భావించినప్పుడు ఉండేది స్నేహభక్తి. ఆయనను మన బిడ్డగా భావించి సేవించేది మాతృభక్తి

– ఇలా తొమ్మిది రకాలు.

ఈ తొమ్మిది రకాలలోనూ మనం చేసేది ఏమిటంటే మనం మనకొక "పాత్ర" ను భగవంతునికి మరో "పాత్ర" ను ఆపాదించుకొని ఆయనను సేవించుకోవటం.మధుర భక్తిలో మనది భార్య పాత్ర ఆయనది భర్త పాత్ర. మాతృ భక్తిలో మనది తల్లి పాత్ర ఆయనది బిడ్డ పాత్ర.

ఈ విధంగా నవవిధభక్తులలో దేనిననుసరించి ఆయనను మనం అర్చించాలన్నా మనకు మన పాత్ర పట్ల శుద్ధి ఉండాలి. అంటే మనం ఆ పాత్రలో ఐక్యమవ్వాలి. భగవంతుని కూడా తన పాత్రలో అంత సంపూర్ణంగానూ చూడగలగాలి. ఇలా సంపూర్ణంగా పాత్రలలో నిమగ్నమవ్వటమే అసలైన పాత్రశుద్ధి. అలా మనం ఎంతగా నిమగ్నమోతామో అన్న దానిపై మన పూజా ఫలం ఆధారపడుతుంది. ఇట్టి పాత్రశుద్ధి లోపిస్తే పూజ ఫలించదు. ఈ ఆంతరంగిక పాత్ర శుద్ధి లేనిదే బాహ్యమైన పాత్రల శుద్ధి, అంటే గిన్నెల శుద్ధి , ఎంత ఉన్నా వ్యర్థమే.

పూజాదికాలలో, అన్యమైన దైవ కార్యక్రమాలలో మనకు తోడ్పడే పాత్ర మన శరీరం. ప్రాణస్వరూపుడైన భగవంతుని నింపుకుని ఉండే మన దేహం నిత్యకృత్యాలవలన, ఆహార నిద్రానియమాలవలన, ఆరోగ్య అనారోగ్యాలవలన మారుతూవుంటుంది. మనం చేసే పాపకార్యాల వలన, తప్పుడు తిండి తినడంవలన కలుషితం అవుతూ ఉంటుంది. అలా కలుషితమై, చెడు అలవాట్లతో పాడైన శరీరం పూజకు కాదుకదా, మన నిత్యజీవితంలోని ధర్మాచరణకు సైతం ఆటంకమవుతుంది. యావజ్జీవితాన్ని భగవంతుని పూజగా మలుచుకునేందుకు మనకు అత్యంత ఉపయోగకరమైన పరికరమే మన శరీరం.ఆయన పూజకు దోహదపడే ప్రాణపాత్ర. అట్టి పాత్రశుద్ధి లోపించిన శరీరం మన సాధనకు, పూజకు ప్రమాదం. అందుకే అన్ని నియమాలు, యోగాసనాల వంటి ప్రక్రియలు ఏర్పరచారు మన పెద్దలు. ఇట్టి పాత్రశుద్ధి చతుర్విధ పురుషార్థ ప్రాప్తికి కీలకం.

ఇక నిత్యజీవితంలోనూ పూజలోను మనం సర్వాంతర్యామి, కరుణాస్వరూపుడు అయిన భగవంతుని మనస్సులో నిలుపుతాం అట్టిమన మనస్సుకూడా అందుకని ఒక పూజాపాత్రే. మనస్సును పనికిమాలిన విషయాలలో తగిలించి, చెత్త విషయాలతో నింపి అపవిత్రం కావించటం, తిరిగి దానిని భగవత్సేవలో వినియోగించాలనే ప్రయత్నంలో విఫలంచెందటం మనందరికీ అలవాటే. సినిమాలు, నవలలు, వ్యర్థమైన కబుర్లలో కలుషితం చేసుకున్న మనస్సును భగవంతునికి ఎలా అర్పించగలం? అశ్లీలమైన, వ్యర్థమైన విషయాలతో మలినమైన మనస్సుతో భగవంతుని ఎలా ఆహ్వానించగలం? ఒకవేళ కరుణామయుడైన ఆయన వచ్చినా, పూజ అయిపోయాక తిరిగి పనికిమాలిన వాటిని లోపలకు రానిచ్చి ఆయనను బయటకు గెంటేసే మనకు ఆధ్యాత్మ సిద్ధి ఎప్పటికైనా కలాగేనా? అందుకే మనస్సు అనే పాత్రను శుద్ధిగా ఉంచుకోవడం మన విధి.

ఈ విశ్వరూపుడైన భగవంతునికి మనం నిత్యం చేసే పూజగా మన జీవితం మారాలి అనే ప్రేరణ నిజమైన భక్తికి ఏకైక నాంది. అది లోపించిందంటే, మనం ఆధ్యాత్మికతలో కుంటుబడ్డామన్నమాటే.

ఇలా కాకుండాఉండాలంటే పై చెప్పుకున్న పాత్రలన్నీ పరిశుద్ధంగా కాపాడుకోవాలి. అట్టి సర్వతోముఖమైన పాత్రశుద్ధి మాత్రమే మనకు సకల శుభాలనూ కలిగించగలదు. అట్టిది మనందరికీ కలిగేలా అనుగ్రహించమని శ్రీ సాయినాథునికి ప్రార్థన.

---

# ఆధ్యాత్మజ్యోతి

ఆచార్య శ్రీ భరద్వాజ

మతం ఏదైనా తన సాటివారిని ద్వేషించడంకన్నా పాపం మరొకటిలేదు. అదీ మతం పేరిట ద్వేషించడం దైవనిందే అవుతుంది. అలా ప్రక్కవారిని ద్వేషిస్తూ, దానిని సమర్ధించుకోడానికి మత గ్రంధాలను పేర్కొనడం సైతాను పవిత్ర గ్రంధాలను వల్లించినట్లుంటుంది. వైజ్ఞానికంగా అభివృద్ధిగాంచిన ఈ యుగంలోకూడా మతం పేరిట ఎన్నో అన్యాయాలు జరగడాన్ని మనం చూస్తున్నాము. వివిధ మతసాంప్రదాయాలకు చెందిన ప్రజలంతా ఒకరి మధ్య ఒకరు జీవించడం తప్పనిసరియైన నేటి సమాజంలో సర్వమత సమన్వయాన్ని బోధించిన శ్రీ శిరిడీ సాయిబాబా కారుచీకటిలో కాంతిరేఖలాగ కనబడతారు.

మొదటిసారి 16 సం॥ల బాలునిగా శిరిడీ ఊరుబయట ఒక వేపచెట్టు క్రింద శిరిడీ ప్రజలకు దర్శనమిచ్చిన సాయి 10-10-1918లో మహాసమాధి అయ్యేంతవరకూ-అంటే సుమారు 60 సం॥లకు పైగా-శిరిడీ వదలివెళ్ళలేదు. ఈ సుదీర్ఘకాలంలో ఎంతో దూరప్రదేశాల నుండి అసంఖ్యాకులైన భక్తులు వారినాశ్రయించి లౌకిక, ఆధ్యాత్మిక శాంతిని పొందారు. హిందూ, ముస్లింల మధ్య సఖ్యత, సోదరభావాలను పెంపొందింపజేయడమే ఆయన ఆధ్యాత్మిక కార్యంలో ప్రధానాంశంగా కనిపిస్తుంది.

కనాడ్‌కు చెందిన హీడాబేగ్, వార్ధాద్‌కు చెందిన అన్వర్‌ఖాన్ మొదలైన సాంప్రదాయక ముస్లింలు ఆధ్యాత్మికోన్నతి కోసం సాయినాశ్రయించారు. బాబా ఇస్లాం మతసాంప్రదాయానుసారం వారికి బోధించి, ఫకీరు ధర్మాలనాచరిస్తూ ఔరంగాబాద్ కంటోన్మెంటు దగ్గర వుండమని హీడాబేగ్‌నూ, బాగ్దాద్‌లో వుండమని అన్వర్‌ఖాన్‌నూ ఆదేశించారు. యాకూబ్ అనే ముస్లిం తన జీవితమంతా సాయి సన్నిధిలోనే గడుపుతూ ప్రతిరోజు బాబా నివసించిన మసీదులో పవిత్ర ఖురాన్ పఠించేవారు. ఔరంగాబాద్ నివాసి హజరత్ దర్వేష్‌షా, నాందేడ్ నివాసియైన అమీరుద్దీన్ ఫకీర్ తన భక్తులను ఆధ్యాత్మిక శిక్షణకోసం సాయి చెంతకు పంపేవారు.

కాశీనాథ్ ఉపాసనీశాస్త్రి (ఉపాసనీబాబా), నానాసాహెబ్ చందోర్కర్ వంటి సాంప్రదాయక హిందువులను సాయి హిందూమత సాంప్రదాయానుసారం ఉద్ధరించారు! నానాసాహెబ్ చందోర్కర్ భగవద్గీతకు వ్యాఖ్యానం చెప్పడంలో తనంతటివాడు లేడని గర్వించేవాడు. ఒకసారాయన బాబాకు పాదసేవ చేస్తూ భగవద్గీతలోని (అ. 4-శ్లో 34) 'తద్విద్ధి ప్రణిపాతేన....' అనే శ్లోకాన్ని వల్లించుకొంటున్నాడు. సాయి ప్రశ్నమీద ప్రశ్న వేసేసరికి నానా సమాధానం చెప్పలేక తెల్లమొహం వేసాడు. తర్వాత ఆ శ్లోకానికాయన అపూర్వమైన వ్యాఖ్యానాన్ని సహేతుకంగా వివరించి చెప్పి నానాలోని అహాన్ని తొలగించారు. ఆ భాష్యాన్ని శంకరాదులు కూడా చెప్పియుండలేదు. ఒకప్పుడు దక్షిణాదినుండి కొందరు వేదపండితులు వచ్చి బాబా సన్నిధిలో వేదం పఠిస్తూ మధ్యలో మంత్రాన్ని మర్చిపోగా బాబా వారికా మంత్రాన్ని అందించారు!

బాబా శ్రీరామనవమి, గురుపూర్ణిమ మొ॥న పండుగలను మసీదులో జరుపుకోమని ప్రోత్సహించేవారు. మొహరం లాంటి పండుగలను జరుపుకోమని ముస్లింలను ప్రోత్సహించేవారు. శ్రీరామనవమి, అదేరోజు ముస్లింల చందనోత్సవము (ఉరుసు) సాయిసన్నిధిలో జరిగేవి. నాటినుంచి నేటివరకూ అన్ని పండుగలలోనూ అన్ని మతాలవారూ సోదరభావంతో పాల్గొంటున్నారు. ఇంతటి సామరస్యాన్ని బాబా, వారియందు ఎలా కలిగించారు?

పాడుబడిన మసీదులో నివసించడమూ, భిక్షచేసి జీవించడమూ-ఎల్లప్పుడూ 'అల్లామాలిక్' అని ఉచ్ఛరిస్తూ వుండడమూ, 'అల్లా అచ్ఛాకరేగా...' అని ఆయన యిచ్చే అభయము వలన మహమ్మదీయులకాయన ఇస్లాం ధర్మాలను తూ.చ. తప్పక ఆచరించే ఫకీరుగా దర్శనమిచ్చేవారు. ముస్లిములకాయన తన గురువు రోషన్‌షా అని చెప్పేవారు.

సాంప్రదాయక ముస్లిం ఒకరు హిందువులు మసీదునపవిత్రం చేస్తుంటే చూస్తూ ఎలా సహిస్తున్నారని బాబానడిగితే అసలైన ముస్లిమే తానయినట్లు'దేశ కాలాలననుసరించి వేషం!' అని చెప్పారు.

హిందువులాయనను సద్గురువుగా తలచేవారు. సాక్షాత్తూ ఆయనను దత్తాత్రేయులవారి అవతారంగా భావించేవారు. ఆయనవుండే మసీదుకు సాయి ద్వారకామాయి అని పేరుపెట్టారు. మసీదుముందర తులసిమాతను ప్రతిష్ఠించారు. ద్వారకామాయిలో నిరంతరాగ్నిహోత్రాన్ను(ధునిని)ంచారు. హిందువులకాయన తన గురువు వెంకూసా అని, తాను నిరంతరం హరినామాన్ని జపిస్తూ హరినే అయ్యాననీ చెప్పారు. పురాణ పురుషులైన రాముడూ, కృష్ణుడూ భూమిపై అవతరించడం వాస్తవమేనని ఆయన చెపుతారు. హిందూ భక్తులచేత భగవద్గీత, భాగవతము, జ్ఞానేశ్వరి, విష్ణు సహస్రనామము, గురుచరిత్ర వంటి పవిత్ర గ్రంధాలను పారాయణ చేయించేవారు. తాము ఇక కొన్ని రోజులలో దేహత్యాగం చేస్తారనగా, ఒక భక్తుడిచేత రామవిజయం అనే గ్రంధాన్ని విడవకుండా మూడుసార్లు పారాయణ చేయించుకొని విన్నారు.

సాయి అనుసరించే మత సామరస్యం ఒక్కోసారి చాలా నిక్కచ్చిగా వుండేది. హిందువులంతా సాయిని చులకనగా చూస్తున్నారనీ, హిందూ సాంప్రదాయాలతో మసీదును అపవిత్రం చేస్తున్నారనీ తలచిన ఇస్లాం మతోన్మాది ఒకరు బాబాతోపాటు మసీదులో నిద్రిస్తున్న హిందువులను ఒక రాత్రి చంపేయబోయాడు. బాబా అతనిని అడ్డుకొని ప్రశాంతంగా "దీనికంతటకీ నేనే కారణం నేనంగీకరించబట్టే కదా వారలా ప్రవర్తిస్తున్నారు. వారిని చంపేకంటే నన్నే చంపేస్తే నీ సమస్య తీరుతుంది కదా!" అన్నారు. అలానే ఒకసారొక ముస్లిం భక్తుడు ఒక యువకుని సాయి చెంతకు తెచ్చి తానా యువకుని ముస్లింగా మార్చానని గర్వంగా బాబాతో చెప్పాడు. మతం మార్చుకున్న ఆ యువకుని సాయి చెంతకు పిల్చి, "నీ అబ్బను మార్చుకున్నావటరా" అంటూ కోపంగా అతని చెంపమీద కొట్టారు. శిరిడీకి వచ్చిన 'రోహిల్లా' ఒకరు 'అల్లాహొఅక్బర్' అని బిగ్గరగా అరుస్తూ ప్రతిరాత్రీ ప్రార్ధనలు చేసేవాడు. కొందరు హిందువులు సాయి దగ్గరకొచ్చి ఆ రోహిల్లా పెద్దగా అరచి తమకు నిద్రాభంగం కలిగిస్తున్నాడని నిందించారు. అప్పుడు సాయి వారితో "భగవంతుని ఎవరేరీతిన ప్రార్థించినా నిందించరాదని" వారిని వారించారు. సాయి దక్షిణరూపంలో వసూలుచేసే ధనంపై పన్నువేయాలని తలచి బ్రిటీష్ ప్రభుత్వం ప్రతిరోజూ సాయి జమాఖర్చులు నమోదుచేయడానికై చక్రనారాయణ అనే ఒక క్రిష్టియన్ ఉద్యోగిని నియమించారు. హిందువులూ, ముస్లిములు అతన్ని నిందిస్తుంటే సాయి వారితో "పందులు చూడండి మలాన్నెంత ప్రతీతో తింటాయో; ఇతరులను నిందించే మీరుకూడా ఆ మలంతినే పందులతో సమానం. ఇలా ప్రవర్తిస్తే శిరిడీలో వుండిమాత్రం ఏమి ప్రయోజనం. అతన్ని విమర్శించడం దేనికి? అతను నా సోదరుడు" అన్నారు. శ్రీ సాయిలో గల మరొక విశేషమేమంటే ఆయన శీలమూ, జీవన విధానమూ ఇతర సాధకులకు, మహాత్ములకు సహితం ఆదర్శంగా వుండడమే! సాయిలోని ధర్మాచరణచూస్తే పామరులకు సహితం పరిపూర్ణుడైన మహాత్ముడు ఎలా వుంటాడో అర్థమైపోతుంది. నిజమైన సద్గురువును వారు తేలికగా గుర్తించగలరు.

వివిధ మతాలకు చెందిన ఆధ్యాత్మిక గ్రంధాలలో సాధకులకు సాధనలో అతీత శక్తులు ప్రాప్తిస్తాయనీ, వాటి వ్యామోహంలో చిక్కి వాటిని ప్రదర్శించడానికి పూనుకున్నవారు అజ్ఞానాంధకారంలో పడి పతితులౌతారని చెబుతాయి. మరి శ్రీ సాయి నిరంతరమట్టి శక్తులు ప్రదర్శించేవారు. ఆయన పరిపూర్ణ సిద్ధపురుషుడని ఎలా తలచడము? అనిపించవచ్చు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఆధ్యాత్మిక శక్తులు రెండు విధములని శాస్త్రములలో చూడవచ్చును. మొదటివి సాధన మధ్యలో జ్ఞానం కలుగకముందు ప్రాప్తించేవి. వీటిని ప్రదర్శించాలంటే సాధకునికి ప్రత్యేక సంకల్పమవసరం. సాధకుడు బాహాటమైన కీర్తి కాంక్షల వలనైనా చేయవచ్చు లేదా జనాన్ని ఆస్తికమార్గానికి లాగడానికన్న ఆత్మవంచన వల్లనైనా కావచ్చు. ఇలా ప్రత్యేక సంకల్పంతో లీలలు ప్రదర్శించాలంటే ప్రదర్శించే తాను వేరనీ, వాటివల్ల ఆకర్షించబడే

జనులు వేరన్న అజ్ఞానం బలపడుతుంది. కనుక సాధకుడు పతితుడౌతాడు. ఈ స్థాయికి చెందిన సాధకులు తమ కీర్తినిగానీ, తమ వంశ, కుల, మత గౌరవాన్ని పెంచాలన్న భ్రాంతిలో చిక్కుతారు. వారి కీర్తిని ప్రకటించమని శిష్యులను ప్రోత్సహిస్తారు. అట్టి కీర్తినందుతున్న సాధకులపట్ల అసూయ, పోటీ భావాలను పొందుతారు. అట్టివారి భక్తులు కూడా అట్టి సంకుచితత్వాన్నే పొంది యితర సాధువుల యందు భక్తిని సహించరు. అందరిలో ఒకే దైవత్వమున్నదన్నమాట వట్టిమాటగా మిగిలిపోతుంది. వారు సరైన గురువు నెన్నుకోలేదనీ, వారి భక్తి సరైనది కాదనీ అనటానికిదే గుర్తు.

రెండవ రకమైన శక్తులు కేవలం ఆత్మజ్ఞానం వలన, పరిపూర్ణత వలన ఆ మహనీయుని ప్రత్యేక సంకల్పమవసరం లేకనే భక్తుల ఆధ్యాత్మికావసరాల్నిబట్టి భగవదిచ్ఛచేత వాటికై అవే జరుగుతాయి. అందుకే బ్రహ్మసూత్రాలలో వ్యాసుడు బ్రహ్మజ్ఞానం వలన సకల శక్తులు బ్రహ్మజ్ఞానికి సంక్రమించగలవని చెప్పారు. ఇట్టి మహనీయులలో లోకోద్ధార కార్యం చేయమన్న దైవాదేశం కల్గితేనే అలా జరుగుతుంది. లేకుంటే వారు లోకానికి తెలియకుండానే అంతరిస్తారు. ఈ శక్తుల భేదాన్ని గురించి శ్రీ రమణమహర్షి కూడా వివరించారు. శ్రీ రామకృష్ణ పరమహంస కూడ సాధకుడెంతటి శక్తి కల్గివున్నా లోకోద్ధారము చేయమన్న ప్రత్యేకమైన దైవాదేశము లేకుంటే చేయరాదని నొక్కి చెప్పేవారు.

అయితే శ్రీ సాయి యిట్టి పూర్ణసిద్ధితో కూడిన శక్తులు కలవారో లేక మహిమల వ్యామోహంలో చిక్కిన పతిత సాధువో ఎలా తెలియాలి?

భ్రాంతిలో చిక్కిన సాధువు దృష్టిలో తాను మహిమాన్వితుడైన గురువుననీ, యితరులు అజ్ఞానులైన శిష్యులనీ, భక్తులనీ భ్రాంతి వుంటుంది. ఇట్టి అజ్ఞాన కారణంగా యితర సాధకులట్టి కీర్తినందుతున్నప్పుడు వారు సహించరు. తమ భక్తులు వారివైపు ఆకర్షింపబడతారేమోనన్న భీతి వారికుంటుంది. అందుకని వ్యంగ్యంగా గాని, ప్రత్యక్షంగా గాని సాటి సాధువులను విమర్శిస్తూ హేళన చేస్తుంటారు. ఇతరుల పటాలను తమ భక్తులు పూజించటం, ఇతర మహనీయులను దర్శించటం, యితర మహాత్ముల గురించి చదవడము వారు సహించరు. అసలైన గురువిలా కాక అన్నింటిలో, అందరిలో తననే చూచుకుంటారు. సాయి సకల దేవతా స్వరూపుడనీ, సకల జీవస్వరూపుడనీ ఎందరి అనుభవాలో నిరూపిస్తున్నాయి. కుక్కను తన రూపంగా చూచారు. తాను గురువుననీ యితరులు శిష్యులనీ ఆయనెన్నడూ అనలేదు. “నిజమైన జ్ఞాని సర్వులనూ జ్ఞానరూపమైన ఆత్మగానే చూస్తాడు. తాను గురువును, జ్ఞానినీ అని తలచేవాడా పేరుకే తగడు” అని రమణమహర్షి వివరించారు.

అంతేకాక బాబా తానొక మతానికీ, జాతికీ, దేశానికీ చెందినట్లు తలచి వాటిని గొప్పచేయాలని యత్నించలేదు. వాటిపై మమత వహించలేదు. తానా దేహమన్న భ్రాంతేలేదు. తన కీర్తినీ, వైభవాన్నీ ఆయనెన్నడు అనుభవించక నిందతో సమానంగా సహించి ఊరుకున్నారు. 60 సం॥లలో ఒక్కసారి కూడా తనను భక్తులు పల్లకీలో ఊరేగించ అంగీకరించలేదు. తననధికంగా చూడనవకాశమివ్వక భిక్షువైన ఫకీరుగానే వ్యవహరించారు. ఆయనను దర్శించరాదనీ, దర్శించవచ్చునీ భక్తులను ఆదేశించే ఆంతరంగికులైన శిష్యులులేరు. పాడుబడ్డ మశీదు, చెప్పులు లేని కాళ్ళు, ఒక్క చింకి కఫ్నీ మాత్రమే కలిగి చివరివరకూ పంచ భిక్షతో మాత్రమే జీవించారు. మడి, ఆచారంతో నివేదించిన దాన్ని మాత్రమే ఆరగించే ‘స్వామి’గా వ్యవహరించలేదు. కుక్కలు, బిచ్చగాళ్ళు యధేచ్ఛగా కుండనుండి తీసుకోగా మిగిలినదాన్నే స్వీకరించిన నిరాడంబరుడు. అన్ని మతాలవారినీ వారి వారి మతాలను నిర్దుష్టంగా ఆచరించమన్నారు. వారి వారి గురువుల నంటిపెట్టుకోమన్నారు గాని తమ భక్తులను అన్య సత్పురుషులను దర్శించవద్దని చెప్పలేదు.

సాయి నిరాడంబరత ఎంతటి పూర్ణత్వానికి చిహ్నమో తెలియాలంటే శాస్త్రంలో తద్విరుద్ధాచరణ ఎంత నింద్యమో తెలియాలి. సర్వభ్రాంతులను, వ్యామోహాలను నిరాకరించి సాధు జీవితాన్నెన్నుకున్నవాడు ఆ తర్వాత వైభవం,

కీర్తులను ఆమోదించడాన్ని కుక్క తాను కక్కినదాన్ని తిరిగి తినడంతో పోల్చాయి ఆధ్యాత్మిక శాస్త్ర గ్రంధాలు. అట్టివారిని నిషిద్ధ గురువులని శాస్త్రం చెబుతుంది.

శ్రీ సాయి ఎంతటి పరిపూర్ణులో తెలిపే మరొక్క విషయం. పై చెప్పిన అజ్ఞానకారణంగా సమాజంలో దివ్యరూపులుగా కొలవబడే సాధువులు మరొక సాధువునెవ్వరినీ ప్రశంసగా మాట్లాడగా చూడము. తమ విశాలతత్త్వాన్ని చాటుకోవాలని బాహాటంగా అలా మాట్లాడినా చాటుగా సన్నిహితులతో ఇతర మహనీయుల గురించి విమర్శనాత్మకంగా మాత్రమే మాట్లాడుతారు. తమ భక్తులు కూడా తమను పొగడుతూ ఇతరులను నిరసిస్తుండడాన్నే వారిష్టపడతారు.

అట్టి ఈ ప్రపంచంలో శ్రీ సాయి సశరీరులై వున్న కాలంలో ఆయనను అందరు మహనీయులూ ప్రశంసించారు. ఆయన కోహినూర్ వంటి వారనీ, తమకంటే పెద్ద అనీ అనడమేగాక తమ భక్తులను ఆయన దర్శన ఆశీస్సుల కోసం పంపారు. అలా పంపినవారిలో శ్రీ అక్కల్‌కోట స్వామి, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ నరసింగ్ మహరాజ్, దర్వేష్‌షా వంటి సకల మతాల సిద్ధపురుషులూ వున్నారు. సాయి మహాసమాధి అనంతరంగూడా ఖేడ్గాం నివాసియైన శ్రీ నారాయణ మహరాజ్‌వంటి వారాయననెంతగా ప్రశంసించారో, వారి సమాధి నెందరు మహనీయులు భక్తిగౌరవాలతో సేవిస్తున్నారో సాయిచరిత్రలో చూడవచ్చు. ఈ విధంగా సర్వమతాలకు చెందిన సాటి మహనీయులు మన్ననలను పొందిన కీర్తి మరొకరికి లభించలేదనే చెప్పాలి.

శ్రీ సాయి యిచ్చినట్లు సకల దేవతలు, జీవులు, సాధువులు తామేనని భక్తులకు నిదర్శనమిచ్చినవారు కూడా చాలా అరుదు. తమ మహాసమాధి అనంతరం కూడా కొన్నివేల మందికి సశరీరంగా దర్శనమివ్వడం కూడ మనమెవ్వరి చరిత్రలోనూ చూడము.

అయినప్పటికీ శ్రీ జ్ఞానేశ్వర మహరాజ్, శ్రీ తుకారామ్ మహరాజ్ వంటి యితర మహాత్ముల హారతులను భక్తులు పాడుతుంటే తాను సామాన్య భక్తుడైనట్లు శ్రద్ధగా నమస్కరిస్తూ కూర్చునేవారు. సాయివలె ఇంతటి నమ్రత కలిగివుండడం కూడా యే సత్పురుషులలోనూ చూడము.

తాను పరిపూర్ణ జ్ఞానాన్ని పొందినాకూడా సాధకుడే అయినట్లు తన ఫకీరు ధర్మాలను శ్రద్ధగా పాటించడం విశేషం. ఫకీరు లేక సన్యాసి పగలు నిద్రించకూడదు, అభ్యంగనస్నాన అలంకరణాదులు తగవు. సుఖాపేక్ష పనికిరాదు. సాయి మధ్యాహ్నం నిద్రించగా గానీ, పడుకోగా గానీ, ఎవరూ చూడలేదని ప్రత్యక్షంగా ఆయనతో చిరకాలమున్న భక్తులందరూ చెప్పారు. ఆయన గోడకానుకొని కూర్చోగా కూడా ఎవరూ చూడలేదు. రాత్రి స్త్రీలను తాను పడుకొనే చోటికి రానివ్వలేదు. అట్టి ఆదర్శవంతమైన నిష్ఠను తనకెట్టి ఆవశ్యకతా లేకున్నా లోకహితార్థం ఆచరించడం కూడా యోవరిలోనూ చూడము. కొద్ది కీర్తి లభించగానే తాము పండినట్లు ఏ నియమానికి కట్టుబడక యధేచ్ఛగా సంచరిస్తూ తామట్టి ధర్మాల కతీతులమని చెబుతూ తన భక్తులకు మాత్రం వాటిని పాటించమని చెబుతారు. కొందరు భక్తులకూ అట్టి ధర్మాల నావశ్యకమని సూచిస్తుంటారు. సూక్ష్మంలో మోక్షమని జనం గొడ్డుదాటుగా చేరుతారు. వారు నిషిద్ధ గురువులంటుంది శాస్త్రం. అందుకే సాయి, “నిజమైన ఫకీర్లు చాలా అరుదు” అనేవారు.

నిజమైన ముముక్షువు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువు నాశ్రయించాలి అనడంలో ఛాందోగ్యము దీనినే చెబుతుంది. తాను బ్రహ్మ నిష్ఠుడై కూడా శృతుల నెరిగి ఆచరించేవాడే అసలైన గురువని భారతీయ శాస్త్రం. క్రైస్తవంలో కూడా అలాగేవున్నది. ఏసుక్రీస్తు కూడా తాను ప్రాచీన ధర్మాలను నశింపజేయడానికి రాలేదనీ, వాటిని పరిపూర్ణం చేయడానికే వచ్చాననీ అంటారు.

అంతేకాదు, ఆత్మనిష్ఠులు, పూర్ణులు అయినవారు తుచ్ఛములైన శక్తి ప్రదర్శనను సహించరు. సాయి కరచాలనంతో వస్తువులను గాలిలోంచి తీసే సాధకుని నిరోధించి మాన్పించటం, మరొక అట్టి సాధకునితో, “వేశ్యతో

ముద్దులాట తగదు" అనడం, "నేనట్టివి ఎన్నడూ చేయను" అని చెప్పడం గమనార్హం. శ్రీ స్వామి సమర్థ (అక్కల్‌కోట స్వామి) కూడా అలానే అట్టి సాధువులను నిగ్రహించారు. నిజమైన సద్గురువుచేసే ఆత్మలీల భక్తులను అన్ని జీవులలోనూ ఒకే పరమాత్మను చూచేలాగు, సర్వకాల సర్వావస్థల యందు అట్టి పరమాత్మను ఏమారకుండుట నేర్పేవిధంగాను మాత్రమే వుంటాయిగాని కేవలం తమ సామర్థ్యాన్ని చూచి భక్తులు సంభ్రమాశ్చర్యములు పొందేలా వుండవు. ఇదేగుర్తు అసలైన మహనీయునికీ నిషిద్ధ గురువుకు. పండ్లనుబట్టి చెట్లను నిర్ణయించాలి. రూపాన్నిబట్టి కాదు. సాయిలీలలో అలా కానిదేదీలేదని యోచనతో తెలుస్తుంది.

ఆత్మజ్ఞానియైన మహనీయుడు ఆశ్రమము, మఠం మొదలైన వాటిని కట్టించడు, నిర్వహించడు. శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి, శ్రీ సాయిబాబా, శ్రీ స్వామి సమర్థ, తాజుద్దీన్ బాబా – యిలా ఎందర్ని చూచినా అదే కనిపిస్తుంది. వశిష్ఠాది ఋషులు కూడా జ్ఞానానంతరం పర్ణ కుటీరాలలో మాత్రముండేవారు. ఆశ్రమ, మఠాదులు నిర్వహించాలంటే కొద్దో గొప్పో తాను గురువని, తమ ఆజ్ఞానుసారం వాటిని నిర్వహించేవారు శిష్యులనే భావం తప్పదు. విరాగియైన సాధువుకు కూడా అవి నిషిద్ధమే. అలాగే సర్వసంగ పరిత్యాగియైన సన్యాసికి గృహస్థుల ఇళ్ళముందు నివసించడం, వారర్పించు శయ్యాదులను, షడ్రసోపేత భోజ్యాదులను స్వీకరించడం తగదు. ఉత్తమ సాధువులలానే జీవించారు. శ్రీ సాయి ఏనాడూ ఏ భక్తులింట్లోను భుజించలేదు, నివసించలేదు. మొదట్లో చాంద్‌భాయి పాటిల్ ప్రార్థననంగీకరించి అతడింటికి సాయి వెళ్ళారని మాత్రం మొదటినుండి వెలువడిన సాయిచరిత్రలో వుంది. కాని అతనితో ధూప్ గ్రామం చేరాక అక్కడ అతనింటనే వుండేవారో లేక అక్కడి వృక్షచ్ఛాయలలో వున్నారోనన్న వివరం తెలియదు. అరవై సంవత్సరాల శిరిడీ జీవితం దృష్ట్యా చూస్తే ఆయనలా ఆతిథ్యాన్ని స్వీకరించారని తోచదు.

అలానే ఆత్మజ్ఞానులైన వారెవ్వరూ ఎవరికీ ఎట్టి మంత్రోపదేశమూ చేయరు. శ్రీరమణులు, శ్రీ సాయి, శ్రీ స్వామి సమర్థ మొదలైన వారెవ్వరూ శిష్యుల నంగీకరించి ఉపదేశాలు చేయలేదు. సాయి కొందరు ముస్లిం భక్తులకు కూడా వారంతకు ముందు చదువుకొనే ఖురానులోని అధ్యాయాలనే ఎలా చదువుకోవాలో నేర్పారేగాని తాముగా ఎవరికీ ఉపదేశం చేయలేదు. ఉపదేశం చేయడం పూర్ణజ్ఞానంలేని వారికే సాధ్యం. వారిలో లోపాలేమన్నా వుంటే అవి వారినుండి వుపదేశమందిన శిష్యులకు కూడా సంక్రమిస్తాయి. శాస్త్రంలో చూస్తే ఇష్టదేవతారాధన, మంత్రజపము మనోవిక్షేప దోషాన్నరికట్టి స్థిర చిత్త రూప చిత్తశుద్ధిని యిస్తాయని చెప్పబడ్డది. జ్ఞానమొక్కటే, ఆత్మనిష్ట ఒక్కటే జ్ఞానాన్నిస్తుందని, దానినివ్వడానికి శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన సద్గురువే సమర్థుడని సర్వశాస్త్రాలు చెబుతాయి. అందుకే సాయి ఎట్టి ఉపదేశాలకోసము పరిగెట్టవద్దని నొక్కి చెప్పారు. ప్రపంచంలో చూస్తే ఉపదేశ మార్గం పేరిట భక్తులను లోబరుచుకొని తమ అధీనులుగా చేసుకోటానికి సన్యాసులు సైతం ప్రయత్నిస్తుండడమెక్కువగా జరుగుతున్నది. ఉపదేశించే గురువుకు అన్ని రూపాలలో ఒకే ఆత్మవున్నదన్న అనుభవం భక్తులకిచ్చే సామర్థ్యముండదు. కనుక సృష్టిలోని వైవిధ్యమే సత్యమని నమ్మేవారు ఆ వైవిధ్యాన్నాధారం చేసుకున్న కామక్రోధాది భావాలను అతిక్రమించడానికి కవసరమైన దోహదమివ్వలేరు. రోజంతా అట్టి భావాలకు తావిస్తూ అనుష్ఠాన కాలంలో మాత్రము మనస్సును ధ్యానంలో నిలపడమసాధ్యం. అందుకని మంత్రోపదేశం పొందిన వారిలో ఎక్కువమంది ఆ జపంతో అదే స్థితిలో తన్నుకులాడటం, గురుధిక్కార భీతిచేత వారికి సదుపాయాలు చేయడానికుపయోగపడడం జరుగుతున్నది. అయితే మంత్రజపం నిరుపయోగమా అంటే అలాకాదు. ఏ సాధనా లేకుండడం కంటే అది మేలే. కాని అసలైన సద్గురు దర్శనంతో పై సాధన నందుకోనిదే ప్రయోజనంలేదు. మంత్రజపం అన్నానికి బియ్యం, పాత్రలు మొదలైన వాటి సేకరణ. సద్గురు సేవ పాకం చేయడం. తద్వారా లభించిన జ్ఞానం అన్నం తినడం. అలాంటప్పుడు పాత్రాదులను సేకరిస్తూ మాత్రమే జీవితమంతా గడిపేస్తే ఏమిలాభం? యావజ్జీవితమూ మంత్రానుష్ఠానములో గడిపిన కావ్యకంఠులు,

రమణ భగవాన్‌ను దర్శించి తమకు ఆత్మానుభూతి కలుగలేదని చెప్పినప్పుడు ఆ మంత్రనాదమెక్కడ పుడుతుందో ఆ చైతన్యాన్ని గుర్తించమని ఉపదేశించారు. అంటే ఆత్మావలోకనాన్నుపదేశించారు. అట్టి ఉపదేశాన్నివ్వడం అట్టి ఆత్మజ్ఞానికే సాధ్యం. అప్పుడే కావ్యకంఠులకు దివ్యానుభూతి కలిగింది. సాయి యంతటి మహనీయుడు ఊరికే ఏదీ చెప్పరు. అందులో ఉపదేశమిచ్చి శిష్యసేకరణ చేయడం సన్యాసికి అసలే నిషిద్ధం.

ఇక సాయి భక్తులెందరో ఈనాడు మహనీయులుగా పూజించబడుతున్నారు. వీరిలో పరస్పర అసహనాదులు కనపడుతున్నాయి. ఇతర సాధునింద కన్పిస్తున్నాయి. రోగాలు తగ్గిస్తాము. భవిష్యత్తు చెబుతాము అనే వారున్నారు. ఆ మాటలు బాబాయే అనలేదు! వీరి విషయంలో కూడా వారు బాబా ఆచరించి చూపిన ధర్మాలనెంతవరకు పాటిస్తున్నారో అంతవరకే వారి విలువ. అంతేకాక సాయి సాంప్రదాయంలో సాయికీ భక్తులకు మధ్య, మధ్యవర్తులే లేరు. సాయి శరీరం చాలించడంతో ఆయన మహిమ అంతమొందే పరిస్థితిలోనే అట్టి మధ్యవర్తులవసరమయ్యేది. సాయి సర్వదా సమాధినుండి కూడా పలుకుతానని వాగ్దానం చేశారు, పలుకుతున్నారు. కనుక సాయి నామముపదేశించడం లాంటి పనులు సాయి సాంప్రదాయానికే విరుద్ధము. అలా చేసేవారు అజ్ఞానకూపంలో దిగి తమను నమ్మినవారినీ దింపుతారు. ఈత రానివాడు మరొకణ్ణేమి రక్షిస్తాడు? ఆత్మజ్ఞాని కానివాడు మరొకడికేమి బోధిస్తాడు? కొందరు సాయి స్వరూపులమని వారి భక్తులచేత పిలిపించుకోవటం కనపడుతుంది. ఇంతకంటే అనాచారమింకొకటి లేదు. సృష్టిలోని కుక్క, నక్క, దోమ, చీమ తమ రూపమేనని సాయి నిరూపిస్తుండగా ఈ భక్తులు తామేదో ప్రత్యేకంగా సాయి రూపులమని నమ్మింపచూడటం గురుద్రోహం. శిష్యద్రోహం. మూఢభక్తుల అజ్ఞానాన్ని తమ కీర్తి ప్రతిష్టల కొరకు వాడుకొనేవారే. సాయి అంతటివారు తామే తమ గురుస్వరూపమని చెప్పలేదు. శాస్త్రం కూడా గురు శిష్యుల మధ్య అద్వైతం కూడదని చెబుతుంది. కనుక యిలా చేసేవారు అటు శాస్త్రాన్ని, యిటు శుద్ధమైన సాంప్రదాయాన్నీ భ్రష్టంచేసేవారే! వారందరూ నిషిద్ధ గురువులే! ఆధ్యాత్మికానికి అనర్థాన్ని తెచ్చేవారే. ఇవన్నీ తెలిసి సరైన ఆచరణ లేనివాడు వైద్యశాస్త్ర ప్రావీణ్యం లేకుండా శస్త్రచికిత్సకు పూనుకున్న వారిలాగ శిష్యుల వినాశనాన్ని, తమకు భగవంతుని దండననూ సిద్ధం చేసుకొనేవారే. ఇవి గుర్తించి నిజమైన సాయి భక్తులు సాయిని సేవిస్తూ తరించాలి. కొద్దో గొప్పో పూర్వ పుణ్య ఫలితమై విశిష్ఠ సాయికృపను పొందినా వారి ఆశీర్వచనం కోరవచ్చుగాని వారిని గురువులుగా పొందటం ఆత్మనాశనాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. సాయి యంతటివారు, "నిజమైన ఫకీరు అరుదు" అని చెబుతుంటే చెట్టుకొక సద్గురువు, పుట్టకొక సద్గురువెలా సాధ్యం? ఇట్టివారి సేవ అనబడు లంచంతో ఆడ్డదారిన మోక్షం కలగదు. ఇట్టివారు ఆశ్రమ, మఠ, మందిర నిర్వహణకు దిగి వాటిని వృద్ధిచేయడం కోసం లౌకికులవలె కుయుక్తులకు అధర్మానికీ, అవినీతికి పాల్పడడం జరుగుతుంది. అది చూస్తూ కూడా కళ్ళు తెరవని స్థితిలో చిక్కుకుపోతారు పామరులు. సాయి చరిత్రనుండి ఈ విషయాలను తెలుసుకొని జాగ్రత్తపడాలి.

కాని శ్రోత్రియుడైన గురువంటే మతం పేరిట చలామణి అయ్యే మౌఢ్యాన్ని సంగతి సందర్భం తెలియకుండా పాటించమనేవారు కాదు. ఆయన మూఢాచారాన్ని నిరశించడానికి వెనుకాడరు. సరియైన ధర్మాచరణను మాననివ్వరు.

అయితే యివన్నీ తెలుసుకున్న మనం యితర ప్రసిద్ధ పురుషులను విమర్శించడానికి పూనుకోకూడదు. అలా విమర్శించడం ద్వారా సర్వాంతర్యామియైన సాయినాథునే నిందిస్తాము. దానికి ఆయన సూక్తులే ఆధారం. ఇతర సాధువుల దోషాలనెలా గుర్తించకూడదో సాయి, జవ్హార్ ఆలీ పట్ల తన ప్రవర్తనద్వారా చాటారు. మనం మాత్రం సర్వులనూ సాయిరూపంగా దర్శించాలి. అదే మన తరింపుకు మార్గం.

---

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 50-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 15-00 |
| విజ్ఞాన వీచికలు | 50-00 |
| పరిప్రశ్న | 40-00 |
| మతమెందుకు? | 30-00 |
| ఏది నిజం? | 30-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 40-00 |
| బుద్ధధ్యాన హృదయం | 30-00 |
| దత్తావతార మహత్యం | 40-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 30-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 25-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 30-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 45-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 35-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 40-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 40-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 40-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 70-00 |
| Supreme Master (Swami Samartha) | 60-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, **Sri Manga Bharadwaja Trust,**
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**